

మెగా డీఎస్సీపై చర్చకు రమ్మంటే ఎందుకు పారిపోతున్నారు? అవకతవకలు జరిగాయని ఆధారాలుంటే బయటపెట్టండి. ఏ నిబంధన ఉల్లంఘించారో, ఏ జీవో తప్పో చెప్పండి. బహిరంగ చర్చకు వచ్చి నిజాలు నిరూపించండి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 12.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 112 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# సంక్షోభంలోనూ.. సూపర్ గ్రోత్!

- ఎల్‌నినో ప్రభావం ఉన్నా ఆర్థిక ప్రగతిలో దూకుడు
- వ్యవసాయం 13.5%.. పరిశ్రమ 10.6%.. సేవలు 9.9%
- ఏపీకి 15% వృద్ధి లక్ష్యం
- 2025-26 రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు నమోదు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలకడైన వృద్ధి నమోదు చేస్తోందని జూలై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేస్తోంది. గడచిన రెండేళ్లుగా జాతీయ వృద్ధి రేటు కంటే ఏపీ వృద్ధిరేటు మెరుగ్గా నమోదు అవుతోంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి వాస్తవ వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం నమోదు చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 9.9 శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదు అవుతున్నట్టు నెలవారీ ఆర్థిక నివేదిక పేర్కొంది. ఈమేరకు సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు 2026 జూలై ఆర్థిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించారు. 2026 జూన్ తో పోలిస్తే పారిశ్రామిక ఉత్పత్తి 8.2 శాతం మేర పెరిగిందని నివేదిక పేర్కొంది. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలానికి సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 89,383 మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో 304 శాతం మేర పెరుగుదల రికార్డు అయినట్టు నివేదిక పేర్కొంది. అటు కూరగాయల ఉత్పత్తిలోనూ 44.8 శాతం మేర పెరుగుదల ఉన్నట్టు ప్రణాళికా విభాగం స్పష్టం చేసింది. పశుసంవర్ధక శాఖలో మాంసం ఉత్పత్తి 9.6 శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1 శాతం, సముద్రపు రొయ్యల్లో 17 శాతం వృద్ధిని సాధించాయి. మిగతా 3లో...

## ప్రజలే.. ప్రభుత్వ బలం!

- 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'లో అందరూ భాగస్వాములు కావాలి
- 'రోడ్ డాక్టర్'తో జీరో పాత్‌హోల్ మిషన్
- గుంతలు పడిన రోడ్లకు తక్షణ మరమ్మతులు..

2లో

## శాంతిభద్రతలపై.. సీఎం సమీక్ష

- సచివాలయంలో నేడు కీలక పోలీసు సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల అధికారులతో సమీక్ష
- స్టేషన్ వారీగా కేసులు.. పనితీరుపై నేరుగా ప్రశ్నలు

2లో



# తల్లీబిడ్డల సేవల్లో.. మహిళా డ్రైవర్లు!

- తల్లీబిడ్డల కోసం అత్యాధునిక అంబులెన్సులు
- మహిళా డ్రైవర్లతో సేవలకు సిద్ధం
- ఏసీ.. ఆరు ఎయిర్‌బ్యాగులు.. జీపీఎస్.. అత్యవసర ఎస్‌వీఎస్ బటన్
- తొలి విడతలో 300.. రెండు నెలల్లో మరో 200: మంత్రి సత్యకుమార్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళలకు ఉద్యోగావకాశాలు, ఆర్థిక స్వావలంబన కల్పించడంలో భాగంగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు మహిళా డ్రైవర్లను నియమించే దిశగా చర్యలు చేపడుతున్నామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లోనూ సమర్థంగా పనిచేస్తున్నారని.. డ్రైవింగ్ కూడా వారికి సాధ్యమేనని చెప్పారు. 102 వాహనాల నిర్వహణ సంస్థ(కన్సార్టియం ఆఫ్ విద్యా వేదా ఫౌండేషన్ అండ్ - 2లో...



# ఆక్వా రైతుకు.. కూటమి భరోసా!



- మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం: అచ్చెన్నాయుడు
- జోన్.. నాన్‌జోన్‌తో సంబంధం లేదు.. ఎకరాల పరిమితీ లేదు
- అర్హులైన ప్రతి రైతుకూ యూనిట్ విద్యుత్ రూ.1.50కే
- ఆక్వా సబ్సిడీకి రెండేళ్లలోనే రూ.1,150 కోట్లు

**పాలకొల్లు,(జర్నలిస్ట్ ఫైల్) :** జోన్, నాన్‌జోన్‌తో సంబంధం లేకుండా, పదెకరాల పరిమితి లేకుండా అర్హులైన ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50కే అందించే హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పాలకొల్లులో వేలాది మంది ఆక్వా రైతుల సమక్షంలో జీవో నెం. 57 విడుదల చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని తెలిపారు. మిగతా 2లో...

# పల్లె పల్లెకూ.. ప్రగతి బాట!

- మారుమూల ఆవాసాలకు తొలిసారి రహదారి సౌకర్యం
- 158 గ్రామాలకు దారులు.. రూ.422.10 కోట్ల నిధులు
- 347 కి.మీ. మేర 146 రోడ్లు.. 19 వంతెనలు
- రోడ్ల నిర్మాణంలో నాణ్యతే ప్రధానం: పవన్ కల్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికి సైతం అభివృద్ధి ఫలాలు చేరాలన్నదే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పం. ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే అడవితల్లి బాట పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నో గిరిశిఖర గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం కల్పించారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మైదాన ప్రాంతాల్లో సైతం జనజీవనానికి దూరంగా విసిరేసినట్టు ఉండే మారుమూల పల్లెలు, ఆవాసాలకు, కుగ్రామాలకు రోడ్లను పరిచయం చేసేందుకు పవన్ కళ్యాణ్ రూపొందించిన ప్రణాళికలు కార్యరూపం దాల్చనున్నాయి. మరో 158 మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతుల ప్రక్రియ పూర్తయ్యింది. 347 కిలోమీటర్ల పొడవున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, కడప, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరం, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పూర్తి రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి, అంచనాలు రూపొందించారు. ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ. 422.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఐదేళ్లపాటు ఈ రోడ్ల నిర్వహణ నిమిత్తం మరో రూ. 24.47 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది.
ఈ సందర్భంగా అధికారులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. మిగతా 2లో...

# మెగా డీఎస్సీపై చర్చకు రమ్మంటే ఎందుకు పారిపోతున్నారు?



- అవకతవకలు జరిగాయని ఆధారాలు ఉంటే బయటపెట్టండి..
- బహిరంగ చర్చకు సిద్ధమా?
- వైసీపీకి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సవాల్
- డీఎస్సీలో వైసీపీ అభ్యర్థులు కూడా ఎంపికయ్యారు..
- అక్రమాలు జరిగితే వారికి ఉద్యోగాలు వచ్చేవా?
- రాజకీయ ఆరోపణలతో తమ భవిష్యత్తుతో ఆడుకోవద్దన్న మెగా డీఎస్సీ ఉపాధ్యాయులు

**తెనాలి, ఆగస్టు 10 (జర్నలిస్ట్ ఫైల్) :** మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న వైసీపీ నాయకులు వాటికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సవాల్ చేశారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని నిరూపించేందుకు ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని, ఆరోపణలు మాత్రమే చేయడం సరికాదని అన్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు మంగళవారం తెనాలిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.
చిన్నరావూరు పార్క్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మెగా డీఎస్సీ నిర్వహించి అర్హత సాధించిన అభ్యర్థులను వెరిఫికేషన్ అనంతరం ప్రాంతాల వారీగా నియమించిందన్నారు. నియామకాలను అడ్డుకునేందుకు పలువురు కోర్టులను ఆశ్రయించినప్పటికీ న్యాయస్థానాల్లో ప్రభుత్వం తరఫున వాదనలు జరిగాయని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే నియామకాలు చేపట్టామని చెప్పారు.
డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న వారు అసలు ఏ నిబంధన ఉల్లంఘించారో, ఏ జీవో తప్పుగా జారీ చేశారో, ఎవరికైనా అన్యాయం జరిగిందో ఆధారాలతో చెప్పాలని ఆలపాటి కోరారు. ఆరోపణలు చేయడం కాకుండా ఆధారాలతో చర్చకు వస్తే వాస్తవాలు ప్రజల ముందుకు వస్తాయని అన్నారు. మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని చెబుతున్న వైసీపీ నేతలు అందుకు సంబంధించిన సాక్ష్యాలను చూపించాలని డిమాండ్ చేశారు. మిగతా 2లో...

# ప్రజలే.. ప్రభుత్వ బలం!



- 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'లో అందరూ భాగస్వాములు కావాలి
- 'రోడ్ డాక్టర్'తో జీరో పాత్‌హోల్ మిషన్
- గుంతలు పడిన రోడ్లకు తక్షణ మరమ్మతులు..

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో అధికారులు.. ఉద్యోగులు, ప్రజలు అంతా భాగస్వామ్యం కావాలి. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందిస్తే జాతి నిర్మాణానికి సహకరించినట్టే. ప్రతి ఉద్యోగి.. ప్రతి అధికారి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలి. పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్ టేకప్ చేయాలి. గుంతలు పడిన రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రయోగత్మకంగా చేస్తున్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. ప్రభుత్వం మంచి పని చేస్తే ప్రజలు ఇన్ వాల్వ్ అవుతారనడానికి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన స్పందనే నిదర్శనం. అలాగే వాస్తవాలను ప్రజలకు వివరించగలిగితే... ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తారు. దీనికి కర్నూలులో డీఎస్సీ-2025 టీచర్లు చేపట్టిన కార్యక్రమమే ప్రత్యక్ష ఉదాహరణ. నెలవారీ ఆర్థిక ప్రగతి నివేదికపై సమీక్షించాం. జూలై నెలలో 10.70 శాతం వృద్ధిని నమోదు చేయగలిగాం. ఎల్ నినో ప్రభావం ఇప్పటి నుంచి ఎక్కువగా ఉండనుంది. ఇప్పుడే అసలు సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. వీటిని అధిగమించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకూ.. ప్రగతి బాట!

(మొదటి పేజీ తరువాయి)

"గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సహకారంతో 158 ఆవాసాలకు తొలిసారి రోడ్డు సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. మారుమూల గ్రామాలకు నిర్మించే రోడ్ల నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి. మనం వేసే రోడ్లు పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడాలి. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించే లక్ష్యంతో నిర్మిస్తున్న రోడ్లు, వంతెనల నిర్మాణంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మార్కెటింగ్ వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయ"ని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# లోకేశ్ అంటే జగన్‌కు భయం



**గుంతకల్లు (జర్నలిస్ట్ ఫైల్) :** మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలు రాజకీయ డ్రామాలేనని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత విమర్శించారు. మంత్రి నారా లోకేశ్ అంటే జగన్‌కు భయమని, అందుకే చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. మెగా డీఎస్సీలో అక్రమాలకు ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ చేశారు. కూటమి ప్రభుత్వం బీసీల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, గుంతకల్లులో రూ. 18 కోట్లతో నిర్మించిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఎంజేపీ గురుకులాలకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తోందన్నారు. 2025 మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేశామని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి సవిత పేర్కొన్నారు.

# సీడ్ యాక్సెస్ రోడ్డుకు తొలగిన అడ్డంకులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. అధికారులు జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు కొట్టేసింది. చాలామంది రైతులు ఇప్పటికే స్వచ్ఛందంగా భూములిచ్చారని న్యాయస్థానం గుర్తుచేసింది. సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం సైతం చాలావరకు పూర్తయ్యిందని తెలిపింది. కొద్దిమంది అభ్యంతరంతో అభివృద్ధి పనులు నిలిచిపోకూడదని తేల్చిచెప్పింది. విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యాజ్యాలను కొట్టేస్తున్నట్లు పేర్కొంది. న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ మంగళవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి సేకరిస్తున్న భూముల విషయంలో అధికారులు చట్ట నిబంధనలను పాటించలేదని, భూసేకరణ నోటిఫికేషన్‌తో పాటు దానికి అనుగుణంగా జారీచేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దుచేయాలని కోరుతూ పెనుమాక, ఉండవల్లి గ్రామాలకు చెందిన ఎనిమిది మంది హైకోర్టులో రెండు వ్యాజ్యాలు దాఖలుచేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. అధికారులు చట్ట నిబంధనలను పాటించలేదని, భూసేకరణ ద్వారా ప్రభావితమయ్యేవారిని గుర్తించి పునరావాస ప్యాకేజి అందించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, భూసేకరణ అధికారుల తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 'చట్ట నిబంధనలను అనుసరించి భూసేకరణ చేస్తున్నాం. అవార్డు నోటీసును అందుకోవడానికి పిటిషనర్లు నిరాకరించారు. నోటీసును ఇంటికి అతికించాం.

# మెగా డీఎస్సీపై చర్చకు రమ్మంటే ఎందుకు పారిపోతున్నారు?





(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ హయాంలో జరిగిన నియామకాలు, అవినీతి వ్యవహారాలపై కూడా ఆలపాటి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో జరిగిన కొన్ని నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించిన వ్యవహారాలపై అప్పట్లో న్యాయపరమైన చర్యలు కూడా ఎదురయ్యాయని పేర్కొన్నారు. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని ఆలపాటి తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారని, భవిష్యత్తులో మరింత మంది యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు భయపడకుండా తమ వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

**వైసీపీ అభ్యర్థులు కూడా ఎంపికయ్యారు :** మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. తాము నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ, కష్టపడి చదివి పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించామని తెలిపారు.

మెగా డీఎస్సీలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు కూడా ఉద్యోగాలు పొందారని, వైసీపీకి చెందిన అభ్యర్థులు కూడా ఎంపికయ్యారని వారు గుర్తుచేశారు. అక్రమాలు జరిగి ఉంటే అన్ని వర్గాలకు చెందిన అభ్యర్థులు మెరిట్ ఆధారంగా ఎలా ఎంపికయ్యారని ప్రశ్నించారు. తమ శ్రమతో సాధించుకున్న ఉద్యోగాలను రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాస్పదం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వైసీపీ నాయకులు ఆధారాలు ఉంటే బయటపెట్టాలని, లేదంటే నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. తమ ఉద్యోగాలపై రాజకీయ విమర్శలు కొనసాగితే 16 వేల మంది ఉపాధ్యాయులు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

**వైసీపీ హయాంలో భారీ అక్రమాలు:** వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకాలపై కూడా ఆలపాటి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో కారుణ్య నియామకాల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వ్యక్తి మరణించకపోయినా మరణించినట్లు చూపించి లక్షల రూపాయలు తీసుకుని నియామకాలు చేసిన వ్యవహారాలు ఉన్నాయని విమర్శించారు.

గ్రూప్-1, గ్రూప్ తదితర పోటీ పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు, న్యాయపరమైన వివాదాల కారణంగా నిజాయితీగా పరీక్షలు రాసి అర్హత సాధించిన అభ్యర్థులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై అనేక మంది అధికారులు కూడా న్యాయపరమైన చర్యలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.

**ఉద్యోగం సాధించిన వారు వాస్తవాలు చెప్పాలి:** మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ప్రతి ఒక్కరూ తమ నిజాయితీని ప్రజల ముందు నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని ఆలపాటి అన్నారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని, నియామక ప్రక్రియలో అక్రమాలు జరగలేదని ధైర్యంగా ప్రజలకు చెప్పాలని సూచించారు.

"తప్పు చేయకపోయినా మన నిజాయితీని మనమే ప్రజలకు చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. మనం తప్పు చేయలేదు.. తప్పు జరగలేదు.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ చెప్పాల్సిన బాధ్యత ఉంది" అని అన్నారు. కష్టపడి సాధించుకున్న ఉద్యోగాలను రాజకీయ వివాదాల్లోకి లాగడం వల్ల అభ్యర్థుల కుటుంబాలు, వారి భవిష్యత్తు దెబ్బతింటాయని చెప్పారు. ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం, తమ నిజాయితీ కోసం గళం విప్పాలని సూచించారు. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిజాయితీగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాజకీయ వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు. ఉద్యోగాలు సాధించిన యువతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజలకు తెలియజేయడమే ఈ ర్యాలీ ఉద్దేశమని ఆలపాటి తెలిపారు.

**తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడం సరికాదు :** కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలను నిరుద్యోగ యువత గుర్తించాలని ఆలపాటి కోరారు. ఎన్నికల హామీల అమలులో భాగంగా మెగా డీఎస్సీ నిర్వహించి వేలాది కుటుంబాల్లో ఆనందం నింపామని అన్నారు. తాము సాధించిన ఉద్యోగం కేవలం వ్యక్తిగత విజయం కాదని, తమ కుటుంబాల ఎన్నో ఏళ్ల కల అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అందువల్ల రాజకీయ ఆరోపణలతో తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయడం సరికాదన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులంతా ధైర్యంగా ముందుకు సాగాలని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆలపాటి సూచించారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా తమ నిజాయితీని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆక్వా రైతుకు.. కూటమి భరోసా!

(మొదటి పేజీ తరువాయి)



పెన్షన్ల పెంపు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 20 వేల సాయం, తల్లికి వందనం, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, మత్స్యకారులకు సాయం వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు.

ఆక్వా విద్యుత్ సబ్సిడీ విషయంలో గత ప్రభుత్వం ఐదేళ్లలో సుమారు రూ. 724 కోట్లు ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ. 1,150 కోట్లు ఖర్చు చేసిందన్నారు. జోన్, నాన్‌జోన్, విస్తీర్ణ పరిమితులతో సంబంధం లేకుండా రూ. 1.50కే విద్యుత్ అందించే నిర్ణయం రైతులకు గణనీయమైన ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు.

**ఆక్వా రంగం చంద్రబాబు మానస పుత్రిక :** ఆక్వా రంగం చంద్రబాబు మానస పుత్రిక అని అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుని బ్లూ ఎకానమీలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. 2014--19 మధ్య ఆక్వా రంగానికి ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వడంతో వృద్ధిరేటు గణనీయంగా పెరిగిందని గుర్తుచేశారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో మార్పులు, ఫీడ్ ధరల పెరుగుదల, విద్యుత్ వ్యయం, ఉత్పత్తుల ధరల పతనం, ఎగుమతుల సమస్యలు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చోలేదన్నారు. రైతులు, పరిశ్రమల ప్రతినిధులను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రుల ముందు సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించామని చెప్పారు.

ఫీడ్ ధరల నియంత్రణకు రైతులు, పరిశ్రమల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు ఫీడ్ ధరలు తగ్గించకుండా, పెరిగినప్పుడు ఇష్టానుసారంగా ధరలు పెంచే విధానానికి ఇకపై అవకాశం ఉండదన్నారు. రైతులు, పరిశ్రమలు రెండింటి ప్రయోజనాలను సమతుల్యం చేస్తామని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ల సబ్సిడీని గత ప్రభుత్వం తొలగించి రైతులపై భారం మోపిందని అచ్చెన్నాయుడు విమర్శించారు. ఆక్వా యూనివర్సిటీకి సంబంధించిన పాత బకాయిల్లో సుమారు రూ. 27 కోట్లు చెల్లించి నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని అచ్చెన్నాయుడు కోరారు. ప్రభుత్వ పనితీరుపై విమర్శలకు వాస్తవాలతో సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమన్నారు. ఆక్వా రంగాన్ని కాపాడి రైతులను నిలబెట్టి ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

# శాంతిభద్రతలపై.. సీఎం సమీక్ష




- సచివాలయంలో నేడు కీలక పోలీసు సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల అధికారులతో సమీక్ష
- స్టేషన్ వారీగా కేసులు.. పనితీరుపై నేరుగా ప్రశ్నలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం 03:30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎన్నడూ లేని విధంగా పోలీస్ వ్యవస్థలోని అన్ని శ్రేణుల అధికారులను ఈ సమీక్షలో భాగస్వామ్యులను చేస్తున్నారు. డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలో పనిచేసే స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు మొత్తంగా 1,300 మంది అధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. శాంతి భద్రతలు, మహిళలు, చిన్నారులపై నేరాల కట్టడి, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా సైకోలు, బ్లేడ్, గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై ముఖ్యమంత్రి లోతైన విశ్లేషణ చేయనున్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల నిర్వహణ వంటి అంశాలపై తన వద్ద ఉన్న రిపోర్టులను ఈ సమావేశంలో నేరుగా అధికారుల ముందే ముఖ్యమంత్రి బయట పెట్టనున్నారు. రాష్ట్రంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు సచివాలయంలో ప్రత్యక్షంగా హాజరు కానుండగా, జిల్లాల్లోని మిగిలిన అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనబోతున్నారు.

# తల్లీబిడ్డల సేవల్లో.. మహిళా డ్రైవర్లు!

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాసా టూర్స్ అండ్ (ట్రావెల్స్) మహిళా డ్రైవర్ల నియామకానికి ప్రతిపాదన చేసిందని.. ప్రభుత్వం దీనిపై సానుకూలంగా ఉందన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట లోని ఏరియా ఆసుపత్రి వద్ద మంగళవారం 102 ఆధునిక అంబులెన్స్‌ల సేవలను ప్రారంభించి, మంత్రి మాట్లాడారు.

**102.. 104.. 108.. ఒకే లక్ష్యం :** గర్భధారణ నుంచి ప్రసవం వరకు 102, అత్యవసర పరిస్థితుల్లో 108, గ్రామస్థాయిలో పరీక్షలు--చికిత్సలకు 104 సేవలను అనుసంధానిస్తూ సమగ్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం తగ్గించి.. అవసరమైన సేవలను వీలైనంత వం-కు వారి వద్దకే తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**తల్లీబిడ్డలకు మరింత భరోసా :** 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రసవం అనంతరం ఆసుపత్రి నుంచి ఇంటికి చేర్చడానికే పరిమితం చేయకుండా గర్భధారణ దశ నుంచే విస్తరిస్తున్నామని మంత్రి తెలిపారు. యాంటీనాటల్ చెకప్‌లకు వెళ్లే గర్భిణులు 102 సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులను ఆసుపత్రికి తరలించడంతోపాటు రక్తహీనతతో బాధపడే గర్భిణులకు అవసరమైన చికిత్స అందేలా సేవలను విస్తరిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 500 కొత్త 102 వాహనాలు అందుబాటులోకి తెస్తున్నామని.. తొలి విడతలో 300, మరో రెండు నెలల్లో 200 వాహనాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వాహనాల్లో ఏసీ, ఆరు ఎయిర్‌బ్యాగులు, ఫుట్‌రెస్ట్, జీపీఎస్ ట్రాకింగ్, అత్యవసర ఎస్‌వీఎస్ బటన్ వంటి సదుపాయాలు కల్పించామని తెలిపారు.

**108, 104లోనూ మార్పులు :** అత్యవసర వైద్య సేవల్లో 108ను బలోపేతం చేశామని మంత్రి తెలిపారు. అంబులెన్సుల సంఖ్యను 602 నుంచి 733కు పెంచామని.. సుమారు 170 అధునాతన జీవనాధార సదుపాయాలున్న వాహనాలు ఉన్నాయని చెప్పారు. పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అంబులెన్స్ చేరే సమయాన్ని కూడా తగ్గించామని తెలిపారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా గ్రామాల్లోనే 41 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించేలా సేవలను విస్తరిస్తున్నామని చెప్పారు. పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి వైద్య సేవలను అందించేలా సంజీవని వేదికను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.




**102 ఖర్చుపై వైకాపా ఆరోపణలను వాస్తవ లెక్కలతో తిప్పికొట్టిన మంత్రి :** 102 నిర్వహణకు ప్రభుత్వం ఎక్కువ ఖర్చు (రెట్టింపు) చేస్తోందంటూ వస్తున్న విమర్శలను మంత్రి శ్రీ సత్యకుమార్ తిప్పికొట్టారు. కొత్త వాహనాలు, ఏసీ, ఆరు ఎయిర్‌బ్యాగులు, జీపీఎస్, అత్యవసర స్పందన వ్యవస్థ వంటి అదనపు సదుపాయాలతో సేవల ప్రమాణాలను పెంచామని చెప్పారు. పెరిగిన వాహనాల ధరలు, కల్పించిన ఆధునిక సేవల కారణంగా ధరలు పెరిగాయని పేర్కొన్నారు. "వాహనాలు కొత్తవి.. సదుపాయాలు కొత్తవి.. పర్యవేక్షణ కొత్తది. గతంలో ఉన్న ఖర్చుతోనే ఇప్పుడు అదే స్థాయి సేవలు ఇవ్వడం ఎలా సాధ్యం?" అని మంత్రి ప్రశ్నించారు. కార్యక్రమం అనంతరం విలేకర్లకు అంబులెన్సులో ఉన్న అత్యాధునిక సౌకర్యాల (ఎయిర్ బ్యాగులు, బాలింతలు ఎక్కేందుకు ఏర్పాటు ఇతర) గురించి వివరించారు.

**వైకాపా హయంలో లేని వాహనాలకు బిల్లుల చెల్లింపులు చేశారు :** గతంలో 102లో 500 వాహనాలు ఉండాల్సి ఉండగా 300లోపే వాహనాలు అందుబాటులో ఉన్నా.. 500 వాహనాలకు బిల్లులు చెల్లించిన పరిస్థితి ఉందని ఆరోపించారు. ఇప్పుడు ప్రతి వాహనం ఎక్కడుందో, ఎప్పుడు బయలుదేరిందో, ఎక్కడికి వెళ్లిందో జీపీఎస్‌తో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

**ఎన్టీఆర్ వైద్యసేవలపై విమర్శలు అర్థరహితం, అవాస్తవం :** ఎన్టీఆర్ వైద్యసేవలను ప్రభుత్వం నిలిపివేసిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. "ఆరోగ్యశ్రీ ఆగలేదు.. పేరు మాత్రమే ఎన్టీఆర్ వైద్యసేవగా మారింది" అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. 2019--24 మధ్య ఐదేళ్లలో ఎన్టీఆర్ వైద్యసేవల కింద సుమారు రూ. 9 వేల కోట్లు ఖర్చు కాగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే సుమారు రూ. 7 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో ఏడాదికి సగటున 8.2 లక్షల మంది లబ్ధి పొందితే.. ప్రస్తుతం ఏడాదికి సగటున 14.5 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు.

"సేవలు ఆగిపోయాయని ఎలా అంటారు? ఖర్చు పెరిగింది.. లబ్ధిదారుల సంఖ్య కూడా పెరిగింది. మరి సేవలు నిలిచిపోయాయని చెప్పడం ఎలా సాధ్యం?" అని మంత్రి ప్రశ్నించారు.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన సేవలు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య, నర్సింగ్, పారామెడికల్ తదితర విభాగాల్లో సుమారు 12 వేల నియామకాలు చేపట్టామని మంత్రి తెలిపారు. సిబ్బంది అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ, ఐపీ సేవలు పెరిగాయని చెప్పారు. నరసరావుపేట ఆసుపత్రిలో మేజర్ సర్జరీలు 3,248 నుంచి 4,321కు, ఎక్స్‌రేలు 14 వేల నుంచి 15,450కు, ఈసీజీలు 5,832 నుంచి 6,900కు పెరిగాయని వివరించారు.

**'డీఎస్సీ'పై అనర్హులతో దుష్ప్రచారం :** డీఎస్సీ నియామకాలపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను మంత్రి సత్యకుమార్ ఖండించారు. నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే ఆధారాలతో ముందుకు రావాలని రాష్ట్ర మంత్రి లోకేష్ స్పష్టంగా చెప్పినప్పటికీ ప్రతిపక్షం ముందుకు రాలేదన్నారు.

' ఆరోపణలు చేయడం కాదు.. ఆధారాలతో చర్చకు రండి. డీఎస్సీ నియామకాలపై బహిరంగ చర్చకు ప్రభుత్వం సిద్ధం. నిజంగా బాధితులు ఉంటే వారు ముందుకు రావాలి. అనర్హుల ద్వారా తప్పుడు ప్రచారం చేయిస్తు న్నారు ' అని మంత్రి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో సదుపాయాలను మెరుగుపరుస్తోందని, దానికనుగుణంగా వైద్య సదుపాయాలను కూడా ప్రజలకు చేరువ చేసేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే అరవింద్ బాబు, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ జె. విజయలక్ష్మి, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**300 వాహనాల ప్రారంభం:** మంత్రి సత్యకుమార్ యాదవ్ నరసరావుపేటలో 50 వాహనాలు ప్రారంభించారు. దీనికి అనుగుణశీగా జిల్లాల్లోనూ అంబులెన్సు ల సేవలు (మొత్తం 300)అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రారంభశీ అ-య్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నరసరావుపేటలో నిర్వహణ సంస్థ ముఖ్య ప్రతినిధి రంగనాధబాబు నరసరావుపేటలో మాట్లాడుతూ వాహనాలను తయారు చేసిన సంస్థ ద్వారానే అంబులెన్సులకు మరమ్మతులు, ఇతర చర్యలు ఉండేలా ఒప్పందాన్ని చేసుకున్నామని చెప్పారు. దీనివల్ల తమ సర్వీసులకు ఎటువంటి అవరోధం ఏర్పడదని తెలిపారు.

**అంబులెన్సును నడిపిన మంత్రి సత్యకుమార్ :** ఏరియా ఆసుపత్రి నుంచి ఎమ్మెల్యే అరవింద్ బాబు ఇంటి వరకు మంత్రి స్వయంగా అంబులెన్సు నడిపారు. ఈ దృశ్యాలు స్థానికులను ఆకట్టుకున్నాయి.

## ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటుకి వినతి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వినతి పత్రం అందించారు. మంగళ వారం ఢిల్లీలో ప్రహ్లాద్ జోషితో ఎంపీలు భేటీ అయ్యారు.
కొత్తగా ఏర్పడిన జిల్లాలతో సహా అన్ని జిల్లాల్లో జేఎన్వీలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2027--28 విద్యా సంవత్సరం నుంచి దశలవారీగా ప్రవేశాలు, విద్యాబోధన ప్రారంభించేలా చూడాలని కోరారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ వల్ల నవోదయ విద్యాలయాలు లేని ప్రాంతాల్లో ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోందని వివరించారు. నవోదయ పాఠశాలల ఏర్పాటుపై కేంద్రానికి ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదనలు పంపారని ఎంపీలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో నవోదయ విద్యాలయాల ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు మార్గం సుగమం అవుతుందని గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచన అని వివరించారు. నవోదయ విద్యాలయ సమితి నిబంధనల ప్రకారం ఉచితంగా భూమి, తాత్కాలిక భవనాలు, మౌలిక వసతులు కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్ర విద్యాశాఖ, నవోదయ విద్యాలయ సమితి, ఏపీ ప్రభుత్వంతోపాటు ఎంపీలతో ఉమ్మడి సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఉమ్మడి సమీక్ష నిర్వహిస్తే త్వరితగతిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల ఏర్పాటు చేయడం వల్ల 'ఎన్ఈపీ-2020', 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలు సాకారమవుతాయని చెప్పారు.

## అంగన్వాడీ లకు జ్ఞాన జ్యోతి ట్రైనింగ్



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ఐసీడీఎస్ కాకుమాను మండలం శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది కి జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా కాకుమాను మండల విద్యా శాఖ అధికారులు కెనెడి,విజయ భాస్కర్ లు పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ అందజేశారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ, పాంద్రపాడు సెక్టార్ సూపర్ వైజర్ ప్రేమలత లు మాట్లాడుతూ మూడు రోజులు ట్రైనింగ్ ప్రోగ్రాము ఉంటుందని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత!

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్నంలోని సుల్తానాబాద్, ఆలపాటి నగర్, సుగాలి కాలనీ, సరళనగర్, జేఎంజే కాలేజీ రోడ్డులో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించే క్రమంలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలియజేశారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## మొరాయించిన పాస్‌పోర్టు సర్వర్లు



**విజయవాడ:** దేశవ్యాప్తంగా పాస్‌పోర్టు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టెక్నికల్ సమస్యల కారణంగా పాస్‌పోర్టు సర్వర్లు ఒక్కసారిగా మొరాయించాయి. దీంతో ఆన్‌లైన్ సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సర్వర్ల డౌన్ ప్రభావం తెలుగు రాష్ట్రాలపై తీవ్రంగా పడింది. విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని పాస్‌పోర్టు కార్యాలయాల్లో సర్వర్లు పని చేయకపోవడంతో సేవల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ఉదయం నుంచీ పడిగాపులు : విజయవాడ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచే దరఖాస్తుదారులు బారులు తీరారు. సర్వర్లు ఎప్పుడు తిరిగి పని చేస్తాయో తెలియక గంటల తరబడి కార్యాలయం వద్దే పడిగాపులు కాస్తున్నారు. కొత్త పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, పునరుద్ధరణ (రెన్యువల్) కోసం వచ్చిన వారు, పాస్‌పోర్టు పాడైపోయి కొత్తవాటికి స్లాట్లు బుక్ చేసుకున్న వారు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు. అపాయింట్‌మెంట్ తీసుకున్న వారిలో విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. సర్వర్ స్లో కావడంతో దరఖాస్తుల ప్రక్రియ ఏమాత్రం ముందుకు సాగడం లేదని అభ్యర్థులు చెబుతున్నారు.
ముందస్తు సమాచారం కరవు : సాంకేతిక సమస్యపై అధికారులు తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన స్లాట్ ప్రకారం సమయానికి కార్యాలయానికి వస్తే, కనీసం లోపలికి కూడా అనుమతించడం లేదని మండిపడుతున్నారు. సర్వర్లు మొరాయించిన విషయాన్ని కనీసం ఫోన్‌కు మెసేజ్ రూపంలో కూడా తెలపలేదని వాపోతున్నారు. కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి చూద్దామంటే, కనీసం కూర్చోవడానికి కుర్చీలు, తాగడానికి మంచినీళ్లు కూడా లేక అవస్థలు పడుతున్నట్లు వివరించారు.
దూర ప్రాంతాల నుంచి : విజయవాడ పాస్‌పోర్టు కార్యాలయానికి కేవలం స్థానికులే కాకుండా రాష్ట్రంలోని పలు మూలల నుంచి ప్రజలు వచ్చారు. రాయలసీమ, ఉమ్మడి గోదావరి జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరులతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కూడా దరఖాస్తుదారులు ఇక్కడికి తరలివచ్చారు. ఒక్కొక్కరికి ఒక్కో స్లాట్ సమయం కేటాయించడంతో లోపలికి అనుమతించకపోవడంతో తమ సమయం దాటిపోతుందేమోనని వారు ఆందోళన చెందారు.

# సంక్షోభంలోనూ.. సూపర్ గ్రోత్!

(మొదటి పేజీ తరువాయి)

సేవా రంగంలో ఐటి, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ఎగుమతుల్లో రూ. 16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి నమోదు అయ్యింది. ఎస్‌టిపిఐ (ఫ్యూ×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి, అలాగే వాణిజ్య వాహనాల కొనుగోళ్లు 51.6 శాతం వృద్ధిని కనబరిచింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెక్నాలజీ ఇంటిగ్రేషనుతో జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. ఖనిజాల్లో 17.9 శాతం, విద్యుత్ వినియోగం 22.2 శాతం మేర పెరిగింది. జూలై మాసానికి సంబంధించి పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దేశీయంగా 3.10 కోట్ల మంది, 35,951 మంది విదేశీ టూరిస్టులు రాష్ట్రానికి వచ్చారని జూలై నెల ఆర్థిక నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడులు గ్రౌండింగ్ తో 75.4 శాతం మేర, రూ. 60 వేల కోట్ల మేర ఎంఎస్ఎంఈ రంగ పెట్టుబడులు 73.6 వృద్ధిని నమోదు చేశాయి. పన్ను, పన్నేతర ఆదాయాల్లో గణనీయంగా వృద్ధి నమోదు అయ్యింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం మేర వృద్ధి నమోదు చేసింది. పారిశ్రామిక రంగం 10.6 శాతం మేర, సేవల రంగం 9.9 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను





పాటిస్తూనే ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.

**ఎల్ నినో సంక్షోభంలో లక్ష్యాల్ని సాధించాలి :** ఎల్ నినో లాంటి సంక్షోభ సమయంలోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికా విభాగం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ టెక్నాలజీని సమర్థంగా అనుసంధానించి లక్ష్యాలను చేరుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం ఉందని కృష్ణా నదిలో ప్రవాహాలు లేని కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు ఇంకా పూర్తిగా నిండలేదని.. గోదావరికి వచ్చిన వరద ప్రవాహాలను మళ్లించి కృష్ణా డెల్టాకు నీరిచ్చామని సీఎం పేర్కొన్నారు. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని.. ఈ నేపథ్యంలో స్థూల ఉత్పత్తి పడిపోకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి లోటుపాట్లను సరిచేసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వశాఖ అత్యున్నత స్థాయి లక్ష్యాలను చేరుకునేలా వనరుల నిర్వహణ చేపట్టాలన్నారు. నిర్దుష్టమైన ప్రమాణాలను అనుసరించి ఫలితాలు వచ్చేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. రూపొందించే ప్రతీ ప్రణాళికా రాష్ట్ర వృద్ధిరేటును పెంచేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూడాలని సూచించారు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు లాంటి అంశాలపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఏపీ 15 శాతం వృద్ధిరేటు సాధించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి కావాల్సిన ఉత్పత్తులపై ప్రభావం లేకుండా చూడాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలవారీగా నివేదికలు ఇస్తే లక్ష్యాల సాధన సులువు అవుతుందని సీఎం సూచించారు. ఈ సమీక్షకు ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, జాయింట్ సెక్రటరీ శాంతి ప్రియా పాండే, ప్రణాళికా విభాగం డైరెక్టర్ బి. గోపాల్, ఏపీఎస్డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి తదితరులు పాల్గొన్నారు.

## హజ్ మొదటి విడత రుసుము చెల్లింపుకు గడువు పొడిగింపు

- 17 తేదీ వరకు పొడిగించిన కేంద్ర హజ్ కమిటీ
- మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** లిపవిత్ర హజ్ యాత్ర -2027 కు ఎంపికైన హాజీలు యాత్ర కోసం చెల్లించాల్సిన రుసుము మొదటి విడత మొత్తం చెల్లింపు గడువు తేదీని కేంద్ర హజ్ కమిటీ పొడిగించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. 10వ తేదీ వరకు మాత్రమే ఉన్న గడువును 17 వ తేదీ వరకు పొడిగించినట్లు మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. ఎంపికైన యాత్రికులందరూ అవసరమైన మొత్తాన్ని ఇప్పటివరకూ జమ చేయని పక్షంలో రూ. 1,52,300 మొత్తాన్ని పొడిగించిన గడువు లోపు పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎంపికైన హజ్ యాత్రికులలో షార్ట్ హజ్ ప్యాకేజీని ఎవరైతే కోరుకున్నారో వారు తమను షార్ట్ హజ్ ప్యాకేజీ కింద పరిగణించాలని ధ్రువీకరిస్తూ, వారు కూడా పొడిగించిన గడువులోగా అవసరమైన మొత్తాన్ని జమ చేయాలని పేర్కొన్నారు. హజ్ యాత్రకు వెళ్లే హాజీలంతా క్రెడిట్ కార్డ్/డెబిట్ కార్డ్/నెట్ బ్యాంకింగ్ ఉపయోగించి https://haj-committee.gov.in లేదా హజ్ సువిధా యాప్‌లో అందుబాటులో ఉన్న ఇ-చెల్లింపు సౌకర్యం ద్వారా మొత్తాన్ని చెల్లించవచ్చున్నారు. ప్రతి కవర్ నంబర్‌కు ఎదురుగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న బ్యాంక్ రిఫరెన్స్ నంబర్‌ను ఉపయోగించి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏదైనా శాఖల లో హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఖాతాలో నిర్దేశించిన పే-ఇన్-స్లిప్ ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. ప్రతి కవర్‌కు అందించిన ప్రత్యేకమైన బ్యాంక్ రిఫరెన్స్ నంబర్‌ను డిపాజిట్‌లో తప్పనిసరిగా పేర్కొనాలన్నారు. ఈ నెల 17తేదీ లోపు అవసరమైన మొత్తాన్ని డిపాజిట్ చేయడంలో విఫలమైన ఎంపికైన యాత్రికులందరి హజ్ సీట్లు, ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా రద్దు చేయబడతాయని కేంద్ర హజ్ కమిటీ హాజీలందరికీ తెలియజేయడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు. వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం 2830 మంది యాత్రికులు ఏపీ నుంచి దరఖాస్తు చేసుకోగా,2792 మంది ఎంపికయ్యారని, వీరిలో 460 మంది షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. విజయవాడ ఏంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంచుకున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. లక్ష ఆర్థిక సాయంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, ఏర్పాట్ల ను పగడ్బందీగా చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.

## కన్నబిడ్డను కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని వేదన

- విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా అకాల మరణం తీవ్రంగా కలచివేసింది
- ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పిన హోంమంత్రి
- డీసీపీ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించిన వంగలపూడి అనిత



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా (24) అకాల మరణం చెందడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.
మంగళవారం విజయవాడలోని ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం నివాసానికి వెళ్లిన హోంమంత్రి అనిత ఆమెను, కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. కన్నబిడ్డను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పారు. చీరాల బీచ్‌కు వెళ్తున్న సమయంలో ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అఫీఫా ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని హోంమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 24 ఏళ్ల చిన్న వయసులోనే నిండు జీవితం ముగియడం అత్యంత బాధాకరమన్నారు. కన్నబిడ్డను కోల్పోవడం ఏ తల్లిదండ్రులకైనా తీరని వేదనని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న హోంమంత్రి, ప్రమాదంలో గాయపడిన వారి వివరాలపై కూడా ఆరా తీశారు. ఈ విషాద సమయంలో షిరీన్ బేగం, ఆమె కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు.
అఫీఫా అకాల మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన హోంమంత్రి వంగలపూడి అనిత, షిరీన్ బేగం కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం, మనోస్థైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## బాపట్ల ఏరియా ఆసుపత్రిలో 'అవయవదాన పక్షోత్సవాలు'



- అవయవదాన రిజిస్ట్రేషన్ చేయించుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు
- మానవత్వానికి ఆదర్శంగా నిలిచి, ప్రజాచైతన్యానికి పిలుపు

**బాపట్ల జిల్లా మెడికల్ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఒక ఉత్తమ నాయకుడు ప్రసంగించడమే కాదు... తనే ముందడుగు వేసి సమాజానికి దిశానిర్దేశం చేస్తారని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మరోసారి నిరూపించారు.
బాపట్ల ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన "అవయవదాన పక్షోత్సవాల" కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అవయవదాన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా తన ఆధార్ కార్డు వివరాలను అందించి, మొదటి వ్యక్తిగా అవయవదాన రిజిస్ట్రేషన్ చేయించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు.
అవయవదానంపై సమాజంలో ఉన్న అపోహలను తుడిచిపెడుతూ, ప్రజాప్రతినిధిగా తానే ముందుండి శ్రీకారం చుట్టడంపై నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, వైద్య వర్గాలు మరియు నెటిజన్లు ఎమ్మెల్యే పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "మరణం తర్వాత కూడా మరొకరికి ప్రాణదానం చేసేందుకు సిద్ధపడటం ఎమ్మెల్యే ఉదార మనస్సుకు, మానవత్వానికి నిదర్శనం" అని పలువురు కొనియాడారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవయవదానం అంటే మరొకరికి పునర్జన్మ ఇవ్వడమే! మన రహితం తర్వాత కూడా మన అవయవాల ద్వారా మరికొందరిలో మనం జీవించి ఉండవచ్చు. ప్రసంగాలు చేయడం కంటే స్వయంగా ఆచరించి చూపించడమే సరైన మార్గమని భావించి నేను ఈ నిర్ణయం తీసుకున్నాను అని అన్నారు. అవయవదానంలో తానే స్వయంగా ముందుండి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా సమాజానికి, ముఖ్యంగా యువతకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు గొప్ప సందేశాన్ని అందించారు. మన రహితం తర్వాత కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప అవకాశం అవయవదానం. బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి సేకరించే అవయవాలు ఎంతో మంది ప్రాణాలను కాపాడతాయి" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవయవదానంపై ఉన్న అపోహలను వీడి, ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏరియా వైద్యశాల నిర్వహించిన ఈ అవగాహన పక్షోత్సవాల కార్యక్రమాన్ని, వైద్యులు మరియు సిబ్బంది కృషిని ఆయన అభినందించారు.
ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు,ఆసుపత్రి సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రజా చైతన్య ఉద్యమం..

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** దేశ సమైక్యత, రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భారత సిపిఐ దేశవ్యాప్త పిలుపు మేరకు 6 నుండి 15 వరకు నిర్వహిస్తున్న ప్రచార ఈరోజు బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సర్కిల్లో నిర్వహించిన కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్. నాగసుబ్బారెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సబ్ కా సాథ్ - సబ్ కా వికాస్" పేరుతో అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను విస్మరించి, దేశ సంపదను కొద్దిమంది పెద్ద కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుకూలంగా వినియోగిస్తోందని విమర్శించారు. నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల, రైతాంగ సంక్షోభం, విద్యా-వైద్య రంగాల సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నప్పటికీ వాటి పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రజల మధ్య విభజన రాజకీయాలను ప్రోత్సహించడం ఆందోళనకరమని అన్నారు. దేశ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలుకాలేదని, నిరుద్యోగం




చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం యువత భవిష్యత్తును చీకటిలోకి నెడుతోందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పిన ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ ఖర్చులు పెరగకుండా నియంత్రించడంలో విఫలమైందన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ ఇవ్వకపోవడం, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను వరుసగా ప్రైవేటీకరణ చేయడం వల్ల లక్షలాది ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నాయని, ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు చేతుల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. బ్యాంకులు, బీమా, రైల్వే, విమానయాన, పోర్టులు, గనులు, విద్యుత్ వంటి వ్యూహాత్మక రంగాల్లో ప్రభుత్వ పాత్రను తగ్గించడం దేశ ఆర్థిక స్వావలంబనకు ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా కార్పొరేట్ విద్యను ప్రోత్సహించడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు తగిన నిధులు, సిబ్బంది, మౌలిక వసతులు కల్పించకుండా ప్రైవేటు వైద్య వ్యవస్థపై ప్రజలను ఆధారపడేలా చేస్తున్నారని విమర్శించారు. మహిళల భద్రత, సాధికారత గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులు, బాలికలపై నేరాలను అరికట్టడంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రాజ్యాంగ హక్కులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, శ్రమజీవుల కష్టం ద్వారా సృష్టించబడిన సంపద కొద్దిమంది పెద్ద వ్యాపార వర్గాల చేతుల్లో కేంద్రీకృతమవుతోందనే విమర్శలు వస్తున్నాయని పేర్కొన్నారు. దేశ సంపద ఫలాలు అందరికీ సమానంగా అందేలా ప్రజా సంక్షేమ విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు పూర్తి, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు, రాయలసీమ అభివృద్ధి ప్యాకేజీ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం మరింత గట్టిగా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశ సమైక్యత, ప్రజల జీవన హక్కులు, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, వైద్యం, రైతాంగ పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం ఆగస్టు 6 నుండి 15 వరకు జరిగే ప్రచార పాదయాత్రల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, అలాగే సెప్టెంబర్ 1న జరిగే "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజల స్వరాన్ని దేశ రాజధానిలో బలంగా వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు ఏరియా కార్యదర్శి షేక్ షావల్లి మండల కార్యదర్శి ప్రభాకర్ మండల సహాయ కార్యదర్శులు నారాయణ రవి ఏఐవైఎఫ్ కార్యదర్శి సురేష్, సుజన్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఒట్టు వేసి.. మాట తప్పారా..?

- నారాయణపూర్ కోసం సమరశంఖం
- 10 రోజుల్లో పరిష్కారం లేకుంటే జిల్లా కేంద్రంలో ఆమరణ దీక్ష : కొత్త జయపాల్ రెడ్డి
- గ్రామస్తులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** నారాయణపూర్ గ్రామాన్ని మొత్తం ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ సీనియర్ నాయకులు కొత్త జయపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘీభావం తెలిపారు. గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలను సోమవారం ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త జయపాల్ రెడ్డి మాట్లాడుతూ. గత శాసనసభ ఎన్నికల సమయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నారాయణపూర్ గ్రామానికి వచ్చి మొత్తం గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దేవుడిపై ఒట్టు వేసి ఇచ్చిన మాటను ఇప్పుడు ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నారాయణపూర్ గ్రామాన్ని పూర్తిస్థాయిలో ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.తమ న్యాయమైన డిమాండ్ కోసం ఆందోళన చేస్తున్న గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసేలా పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గ్రామస్తులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నారాయణపూర్‌ను మొత్తం ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరారు.పది రోజుల్లోగా సమస్యను పరిష్కరించకపోతే నారాయణపూర్‌లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను జిల్లా కేంద్రానికి తరలిస్తామని, అక్కడ ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని కొత్త జయపాల్ రెడ్డి హెచ్చరించారు. ముంపు గ్రామంగా ప్రకటించే వరకు బీఆర్ఎస్ పార్టీ గ్రామస్తులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఒత్తిడితోనే పోలీసులు నారాయణపూర్ గ్రామస్తులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గ్రామస్తులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నారాయణపూర్ గ్రామస్తులపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎందుకు కక్ష సాధింపు ధోరణితో వ్యవహరి స్తున్నారని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో నారాయణపూర్ గ్రామస్తులకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిలబెట్టు కోవాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. గ్రామాన్ని పూర్తిస్థాయిలో ముంపు గ్రామంగా ప్రకటించే వరకు గ్రామస్తుల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పంట రుణాలు, రైతు భరోసా రాక అంబసత్రం రైతుల అవస్థలు

- అంబసత్రం సాగుదారులను గోసపెట్టొద్దు
- మండలరైతాంగానికి సీతారామ జలాలను అందించాలి
- కార్పొరేట్‌కొమ్ముకాసే బీజెపి వైఖరి మారే వరకు పోరాడుతాం
- సీపీఐ జన చైతన్యయాత్రకు అపూర్వ స్పందన : సాబీర్‌పాషా



**కొత్తగూడెం, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** దశాబ్దాలుగా భూములను నమ్ముకోని సాగుచేసుకుంటున్న అంబసత్రం భూముల పేద రైతులకు హక్కుపత్రాలు ఇవ్వకుండా పాలకులు గోసపెట్టడం తగదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు సిపిఐ కౌన్సిల్ చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర ఐదో రోజు సోమవారం లక్ష్మీదేవి పల్లిమండలంలో సాగింది. సీతారాంపురం, లాలూతండా, కారు కొండ, హేమచంద్రాపురం తదితరగ్రామాల మీదుగా సాగిన యాత్రకు ప్రజలు, రైతులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధగ్రామాల సెంటర్లలో జరిగిన బహిరంగ సభల్లో యాత్ర రథసారథి సాబీర్‌పాషా మాట్లాడుతూ మండల పరిధిలోని 264సర్వే నెంబర్లోనిఐదు వేల ఎకరాల అంబసత్రం భూములను గిరిజన, గిరిజనేతర పేదలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. రికార్డుల్లో అనుభవ దారులుగా ఉన్నప్పటికీ ఆభూములపై చట్టబద్ధమైన హక్కులు లేవనేసాకుతో ప్రభుత్వం రైతుభరోసా నిలిపివేసిందని, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని, సాగుకు పెట్టుబడులులేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతూ తీవ్ర అవస్థలు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకు నేందుకు అనుమతులు ఎందుఉ నిరాకరిస్తున్నారో ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే సాగుదారులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని, నిర్మితమవుతున్న సీతారామ ఎత్తిపోతల జలాలను లక్ష్మీదేవిపల్లి మండల రైతాంగానికి సాగు నీరుగా పారించి భూములు సస్యశ్యామలం చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు కేంద్రంలోని బీజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజాకంటక విధానాలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడు తున్నారని విమర్శించారు. బీజెపి వైఖరి మారేవరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. టేకులపల్లిలో ఇల్లందు ఎమ్మెల్యే కోరంకనకయ్య యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలోనాయకులు ముత్యాల విశ్వనాథం, వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, సరరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, వీరాస్వామి, వాసిరెడ్డి మురళీ, ఫహీం, శ్రీనివాస్, అజిత్, రాంబాబు, రాము, ఉపేందర్, రత్నకుమారి, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 12వ వేతన ఒప్పందం కోసంకార్మికుల కదనభేరి

- వెంటనే వేతనకమిటీ ఏర్పాటు చేయాలి
- జీఎంకార్యాలయం ముట్టడి ఐక్యంగా గర్జించిన కార్మిక సంఘాలు



**కొత్తగూడెంసింగరేణి ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** 12వ వేతన కమిటీని వెంటనేఏర్పాటు చేసి చర్చల ప్రక్రియ ప్రారంభిం చాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏరియా జిఎం కార్యాలయం ఎదుట ఏఐటియుసి, ఐఎన్టీయుసి, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి కేంద్రప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జూలై1 నుంచి 12వ వేతనాల పరిమితి ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు వేతన కమిటీ ఏర్పాటుపై కేంద్రప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యమని సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన బొగ్గు పరిశ్రమను తమ శ్రమతో ముందుకునడిపిస్తున్న కార్మికుల వేతనాలు విషయంలో జాప్యం చేయడం అన్యాయమన్నారు. కార్మికుల వేతనాలు, అలవెన్సులు, ఇతర ఆర్థికప్రయోజనాలపై వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలను పక్కన పెట్టి వేతనాలు, హక్కులు సంక్షేమానికిసంబంధించి నిర్ణయాలు తీసుకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరిం చారు. కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకువచ్చే విధా నాలను ఐక్యంగా అడ్డుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, కార్మిక హక్కులు సంక్షేమ ప్రయోజ నాలకు భంగం కలిగించే చర్యలను సహించేది లేదన్నారు. కార్మికుల సహనాన్ని పరీక్షిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ జిఎంకార్యాలయాన్ని ముట్టడించారు. కొత్తగూడెం ధర్నా ముట్టడి కార్మిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచిం దని సంఘాల నాయకులు పేర్కొన్నారు. 12వ వేతన కమిటీని వెంటనేఏర్పాటుచేసి చర్చల ప్రక్రియ ప్రారంభించే వరకు ఉద్యమం ఆగదని నాయకులుస్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నిసంఘాలనాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, వంగా వెంకట్, వీరాస్వామి, గట్టయ్య, రమణమూర్తి, కత్తర్ల రాములు, కిష్టోఫర్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రజాక్, రాజేశ్వరరావు, జె.రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, అభిషేక్, కుమారస్వామి, మంద నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్,వెంకటేశ్వర్లు, రాజబాబు, రమేష్‌బాబు పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

# రిజర్వ్ ఫారెస్టులో కొత్త ఇంటి నెంబర్లు కేటాయిస్తే చర్యలు

- పంచాయతీ కార్యదర్శులకు మండల అటవీశాఖ హెచ్చరిక
- అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన అటవీ రేంజ్ అధికారి వి.శ్రీనివాసరావు

**లక్ష్మీదేవిపల్లి ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** రిజర్వు ఫారెస్టు పరిధిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లకు కొత్త ఇంటి నెంబర్లు కేటాయించవద్దని కొత్తగూడెం అటవీ శాఖ పంచాయతీ కార్యదర్శులను అటవీ రేంజ్ అధికారి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. (ఎఫ్ఆర్ఓ కొత్తగూడెం ఆర్‌సినెంబర్ 4/2023/కెజిఎం, 10.04.2024న) గత నెల 22న అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు, చాతకొండబీట్ పరిధిలోని రిజర్వుఫారెస్టు ప్రాంతాల్లో అక్రమ ఇంటినిర్మాణాలకు కొత్త ఇంటి నెంబర్లు కేటాయించవద్దని, లక్ష్మీదేవిపల్లి, సంజయ్‌నగర్, ప్రశాంత్‌నగర్, హమాలీ కాలనీ, లోతువాగు గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలుజారీ చేశారు.రిజర్వు ఫారెస్టులో అక్రమ నిర్మాణాలకు ఇంటి నెంబర్లు కేటాయించడం వల్ల అటవీ భూముల ఆక్రమణలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అటవీ, పంచాయతీ, పోలీస్‌శాఖలు సమన్వయంతో పని చేసి అక్రమ ఇంటి నిర్మాణాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఆయా పంచాయతీల కార్య దర్శులకు ఈవిషయంపై సమాచారం ఇచ్చిన ప్పటికీ కొందరు రిజర్వు ఫారెస్టు పరిధిలోని ఇళ్లకు కొత్త ఇంటినెంబర్లు కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై కొత్త ఇంటినెంబర్లు ఇస్తే సంబంధిత కార్యదర్శులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ చట్టాల ప్రకారం రిజర్వు ఫారెస్టులో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం, అటవీ భూముల ఆక్రమణ చట్ట విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ యాక్ట్



1967నిబంధనలప్రకారం రిజర్వు ఫారెస్టులో ఇళ్ల నిర్మాణాలు అక్రమం, ఫారెస్టు కన్జర్వేషన్ యాక్ట్ 1980నిబంధనల ప్రకారం అటవీ భూములను ఆక్రమించడం, ఇంటి నిర్మాణ పనులు చేపట్టడం నేరమన్నారు.లక్ష్మీదేవిపల్లి, సంజయ్‌నగర్, ప్రశాంతినగర్, హమాలీకాలనీ, లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు గ్రామపంచాయతీ పరిధిలోనిచాతకొండ రిజర్వు ఫారెస్టులోని లోతువాగు బీటు, చాతకొండబీటు ప్రాంతాలలో కొత్తఇంటినెంబర్లు కేటాయించి నట్లయితే ఫారెస్టు కన్జర్వేషన్ యాక్ట్ 1980 నిబంధనప్రకారం కొత్తఇంటినెంబర్లు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ సమాచారాన్ని కొత్తగూడెం డివిజన్ అటవీ అధికారులకు, లక్ష్మీదేవిపల్లి తహశీల్దార్, ఎంపిడిఓ,ఎంపిఓలకు తెలిపామన్నారు.

# గూడెం అభివృద్ధి సీపీఐతోనే సాధ్యం

- జిఓనెంబర్ 76ను బుట్టదాఖలు చేస్తే ఊరుకోం...
- అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలి
- గూడెం అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి
- ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తాం...నిలదిస్తాం...
- కేంద్ర తీరు ప్రజాగ్రహానికి గురికాక తప్పదు :ఎస్‌కె.సాబీర్‌పాషా



**కొత్తగూడెం ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తగూడెం ప్రాంత అభివృద్ధిని గాడిలో పెట్టింది సిపిఐ మాత్రమేనని, నియోజకవర్గ అభివృద్ధికోసం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషికిప్రభుత్వం సహకరించాలని సిపిఐ జిలా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు చేపట్టినప్రజాచైతన్య యాత్ర సోమవారం పట్టణం లోని చుంచుపల్లి కార్మిక ప్రాంతాల్లో కొనసాగింది. ఆటా పాటలతో అత్యంత ఉత్సాహంగా సాగిన ఈయాత్రలో భాగంగా రైల్వే స్టేషన్ సెంటర్, ఎంజిరోడ్డు, సూర్యపాలస్‌రోడ్, సింగరేణి హెడ్డాఫీస్,ఎసిబినగర్, రామవరం, త్రీఇంక్లైన్, 4ఇంక్లైన్, రుద్రంపూర్, గౌతంపూర్ పెనగడప సెంటర్లలో జరిగిన సభల్లో సాబీర్‌పాషా మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన క్రమబద్ధీకరణ జిఓ 76ను బుట్టదాఖలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పట్టాల జారీ ప్రక్రియ ఎమైందో పాలకులుసమాధానం చెప్పాలని, దశాబ్దాలుగా నివాసముంటున్న రామవరం, సింగరేణిప్రాంత ప్రజలు తక్షణమే పొజేషన్ సర్టిఫికెట్లు జారీచేసియాజమాన్యపు హక్కులు కల్పించాలనిడిమాండ్ చేశారు.దరఖాస్తు చేసుకున్నప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు తక్షణమే మంజూరుచేయాలన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని, సిఎస్ఆర్ నిధులతో సింగరేణిప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధిచేయాలన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మాజీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, సంస్థపై పరోక్షంగా ఆధారపడిన కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లనుయాజమాన్యం కూల్చివేసి నిర్వాసితులను చేసేకుట్రలు చేస్తుందని ఈవిధానాన్ని మార్చుకోవాలన్నారు. పాలకుల ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలనుప్రశ్నిస్తామని, రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, వెంకటేశ్వరరావు, మూడు గణేష్, పుల్లారెడ్డి, లక్ష్మీకుమారి, శ్రీనివాసరావు, జమలయ్య, పూర్ణచంద్రరావు, మురళీ, రాహుల్, భాస్కర్, వీరాస్వామి, మురళీ, ఫహీం, శ్రీనివాస్, అజిత్, విజయ్‌కుమార్, నర్సింహా, దుర్గయ్య, సుధాకర్, పద్మ, శంకర్, వెంకటేశ్వరరావు, ధనలక్ష్మీ, యూసుఫ్, గట్టయ్య, ఖయూమ్, గోపికృష్ణ పాల్గొన్నారు.

# 12వ వేజ్‌బోర్డు ఏర్పాటు చేయాలి

- సింగరేణిలో మహా ధర్నా



**కొత్తగూడెం,సింగరేణి ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణిసత్తుపల్లి స్థానిక పట్టణం సింగరేణిలో 12వేజ్‌బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని జెవిఆర్‌ఓసి, కిష్టారంఓసి, జెవిఆర్‌సిహెచ్‌పి సింగరేణి ఉద్యోగులందరూ ఐఎన్టీయుసి సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, సింగరేణిలో ఉన్న జాతీయ సంఘాల పిలుపుమేరకు సింగరేణి వ్యాప్తంగా సోమవారం ధర్నా చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు ఐఎన్టీయుసి, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, సిఐటియు, టిబిజికెఎస్ యూనియన్ జేఏసి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించి సింగరేణి ఛైర్మన్‌అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు సత్తుపల్లి జిఎం సరికొండ వెంకటాచారి ద్వారా వినతిపత్రం అందించారు. సత్తుపల్లిసింగరేణి ఐక్య కార్మిక సంఘాల జేఏసి నాయకులు తీగల క్రాంతికుమార్, కోటేశ్వరరావు, సముద్రాల సుధాకర్, దార భీమయ్య, ఆంజనేయులు, అస్గర్‌ఖాన్, సంపత్, గిడ్డయ్య మాట్లాడుతూ కోల్ ఇండియా పరిధిలో ఉండే అన్ని బొగ్గు పరిశ్రమల్లో ఉద్యోగుల జీతభత్యాల పెంపు కోసం కేంద్రప్రభుత్వం 12వ వేజ్‌బోర్డు ఏర్పాటుకు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 11వేజ్ బోర్డు 2026జూన్‌నెల నాటికి ముగిసందని, 11బేజ్ బోర్డుపై ఆరునెలల ముందే కమిటీని ఏర్పాటు చేసినంటువంటి కేంద్ర ప్రభుత్వం 12వేజ్‌బోర్డు సమయం దాటినప్పటికీ ఎందుకు ఏర్పాటు చేయట్లేదని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం ఇప్పటి వరు 12వేజ్‌బోర్డుపై కమిటీని ఏర్పాటు చేయకుండా కలకత్తాలో జరిగిన సమావేశంలోకేవలం నాలుగు లేబర్‌కోడ్ అమలుపై మాత్రమే ప్రస్తావన చేశారని, సెప్టెంబర్ 12న రాంచీలో జరిగే సదస్సులో వేజ్‌బోర్డు విషయంపై స్పష్టత రాకుంటే కోల్‌ఇండియా వ్యాప్తంగా కార్మిక వర్గం అంతా సమ్మె చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సింగరేణిఐక్య కార్యముక సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కాంట్రిబ్యూటరీ పెన్షన్‌రద్దు చేసి పాత పెన్షన్‌స్కీమ్ పునరుద్ధరించాలి

- 23న ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి
- ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తు కోసంఐక్య ఉద్యమం : బానోతు లక్ష్మ



**కొత్తగూడెం ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 2004నుంచిఅమలులో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ తక్షణమే రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానంను పునరుద్ధరించాలని తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బానోతు లక్ష్మ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జీవితాంతంప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవ ప్రదమైన జీవితం గడిపేలా పెన్షన్ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సిపిఎస్ విధానం వల్ల పదవీ విరమణ అనంతరం అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరిపడా పెన్షన్ లభించక వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం చేసిన తర్వాత కూడా వృద్ధాప్యంలో ఆర్థికభద్రత లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. రాష్ట్ర ఉద్యోగ-ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలు దీర్ఘకాలంగా ఎండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పిఆర్‌సి ఆలస్యం, పెండింగ్ డిఏలు, సిపిఎస్ బకాయిలు, ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు తదితర సమస్యలనుప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఒక్క శాఖకాదు, రాష్ట్ర ఉద్యోగులంతా ఒక్కటే అని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, వైద్యులు, నర్సులు, పోలీసులు, ఫైర్‌మెన్, రెవెన్యూ, ట్రెజరీ, ఫారెస్టు, పంచాయతీ, మున్సిపల్ తదితర అన్ని శాఖల ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 23న నిర్వహించే ఛలో హైదరాబాద్‌కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. ఎంతకాలం ఈ మౌనం?ఎంతకాలం ఈ నిస్సహాయత? మన భవిష్యత్తు కోసం ఇప్పుడే ఉద్యమించాలి, పాత పెన్షన్ సాధించే వరకు ఐక్యంగా పోరాడాలని అని ఆయన అన్నారు. సిపిఎస్ రద్దు ఓపిఎస్ పునరుద్ధరణ సాధించే వరకు పోరాటం చేయాలని తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై అధికారుల సమీక్ష

- విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందేలా సాంస్కృతిక ప్రదర్శనలు
- పర్సనల్ మేనేజర్ - తిరుపతి



**గోదావరిఖని, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి సంస్థ ఆర్.జి-1 ఏరియాలో ఈనెల 15న నిర్వహించనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు,సాంస్కృతిక కార్యక్రమాలపై పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి అధ్యక్షతన జీఎం కార్యాలయంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ,విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా దేశభక్తి గీతాలు,జాతీయ సమైక్యతను చాటే సాంస్కృతిక ప్రదర్శనలను క్రమబద్ధంగా రూపొందించాలని కోరారు. ఉద్యోగులు,వారి కుటుంబ సభ్యులు,విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకునేలా వేదిక ఏర్పాట్లు, కార్యక్రమాల నిర్వహణపై పాఠశాలల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో సీనియర్ పి.ఓ. హన్మంతరావు,సేవా కార్యదర్శి టీనా సింగ్, జాయింట్ సెక్రటరీ పెరుమాళ్ల రజిత,కో-ఆర్డినేటర్లు మేడి తిరుపతి, సిద్దిక్ తో పాటు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# బీసీ అభ్యున్నతికోసం నిరంతరం కృషిచేసిన నాయకుడు శివశంకర్

- మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శివశంకర్ జయంతి వేడుకలు



**కొత్తగూడెం, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి జాతీయ నాయకుడు, న్యాయ కోవిదుడు దివంగత పుంజాల శివశంకర్ అని బిసినాయకులు అన్నారు. ఈసందర్భంగా సోమవారం మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఆసంఘం భవన కార్యాలయంలో శివశంకర్ జయంతి వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగా నివాళ్లు అర్పించారు. కేంద్రమంత్రిగా, న్యాయవాదిగా, బిసి ఉద్యమకారుడిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం బీసీలంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావిరాంబాబు, భీమాశ్రీవల్లి,శ్రీధర్, సంఘం బాధ్యులు లింగాల గోపాలకృష్ణ, బండారి రుక్మాంగాధర్, బండి విజయ్‌భాస్కర్, జోగం తారక్, కందుకూరి గణేష్, శేఖర్, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం..

- జెండా చౌరస్తాలో జాతీయ జెండా ఆవిష్కరణ..
- భారత్ మాతాకీ జై' నినాదాలతో మార్మోగిన పట్టణం





**పెద్దపల్లి, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ అధికారి మేకల విజయ్ కుమార్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలు చేయడంతో పెద్దపల్లి పట్టణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా జాతీయ జెండాపై గౌరవం, దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో పెంపొందించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివంగర్ సతీష్, తిరంగా యాత్ర కో-కన్వీనర్ కావేటి రాజగోపాల్, బెజ్జంకి దిలీప్, గుడ్ల సతీష్, మహంత కృష్ణ, బొడ్డుపల్లి కుమార్, అఖిల్, మధుకర్, హరీష్, పోగుల రాజు, మంతెన కృష్ణ, మహేష్, శ్రావణ్, రమేష్, శివసాయి, సురేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామగుండంలో ఘనంగా పుంజాల శివశంకర్ 97వ జయంతి వేడుకలు

**రామ్ మందిర్ ఏరియా, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
రామగుండం లో మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ 97వ జయంతి వేడుకలను రామగుండం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక తబితా నిస్సయుల ఆశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు నాయకులు మాట్లాడుతూ.. పుంజాల శివశంకర్ కేంద్ర మంత్రిగా దేశానికి అందించిన సేవలు, చేపట్టిన సంస్కరణలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని కొనియాడారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్నూరు కాపు నాయకులు పానగంటి సత్యనారాయణ పటేల్, అప్పాసి శ్రీనివాస్ పటేల్, చల్ల శ్రీనివాస్



పటేల్, ఇసంపెల్లి తిరుపతి పటేల్, తూండ్ల శ్రీనివాస్ పటేల్, సాధు రమేష్ పటేల్, మల్క ప్రసాద్ పటేల్, తాని శ్రావణ్ పటేల్, బద్రి సాయి పటేల్ తదితరులు, అలాగే ఆశ్రమంలోని పిల్లలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## - సాంస్కృతిక కార్యక్రమాలపై పాఠశాలల కరస్పాండెంట్లతో ఆర్జీ-1 ఏరియాలో సమీక్ష

**రామ్ మందిర్ ఏరియా, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లతో సాంస్కృతిక కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్జీ-1 ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించాల్సిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేదిక ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు.
ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, విద్యార్థుల్లో దేశభక్తి భావాలను మరింత పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. విద్యార్థులతో దేశభక్తి గీతాలు, జాతీయ గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహించాలని కోరారు. వేడుకలకు హాజరయ్యే సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఉత్తమ ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర అతిథులను ఆకట్టుకునేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. స్వాతంత్ర్య



దినోత్సవ వేడుకలు ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయ సమైక్యత, బాధ్యతాయుత పౌరస్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ పీఓ హన్మంతరావు, సేవా కార్యదర్శి బీనా సింగ్, సేవా జాయింట్ సెక్రటరీ పెరుమాళ్ల రజిత, సేవా సమితి కో-ఆర్డినేటర్లు మేడి తిరుపతి, సిద్దిక్‌తో పాటు వివిధ సింగరేణి, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా నగర్‌లో ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు మహోత్సవం

## అట్టహాసంగా నిర్వహించిన మహిళా సోదరీమణులు..
## పాల్గొన్న :మనాలి ఠాకూర్

**రామ్ మందిర్ ఏరియా, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
రామగుండం దుర్గా నగర్ కాలనీలో ఆషాఢ మాస గోరింటాకు మహోత్సవాన్ని మహిళా సోదరీమణులు ఘనంగా నిర్వహించారు. మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను అట్టహాసంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్ ఠాకూర్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి సింగ్ రాజ్ ఠాకూర్, 47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి హాజరయ్యారు. మనాలి సింగ్ రాజ్ ఠాకూర్ జ్యోతి ప్రజ్వలన చేసి, మహిళలకు గోరింటాకు పెట్టి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మనాలి



సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమన్నారు. దుర్గా నగర్ మహిళలంతా ఒకచోట చేరి ఇలాంటి వేడుకలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రామగుండం అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సైతం దుర్గా నగర్ వాసిగా ఉండటం, స్థానికులతో కలిసి కుటుంబ సభ్యుల్లా మమేకం కావడం ఆనందంగా ఉందన్నారు. కాలనీ అధ్యక్షుడు పందిళ్ల బుచ్చి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ కంది రవీందర్ రెడ్డి స్వాగత ప్రసంగం చేశారు. ముఖ్య సలహాదారు పొలసాని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంథని సంపత్, సలహాదారు స్వామి గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఉమ్మెత్తల దేవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కరివేద సత్యనారాయణ రెడ్డి, ట్రెజరర్ కొల్లూరి సుధాకర్, కల్చరల్ సెక్రెటరీ కొల్లూరి విజేందర్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుర్రం శ్రీనివాస్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఎతిరాజు సురేష్, మల్లేశం, మల్లేశ్వరరావు, కేశవులు, సీహెచ్ తిరుపతి తదితరులు, వందలాది మంది మహిళా సోదరీమణులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. మహిళా సోదరి బాలసాని పద్మ, స్వామి గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. వేడుకలను విజయవంతం చేసిన దుర్గా నగర్ మహిళా సోదరీమణులకు, సోదరులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వివక్ష చూపిస్తే చూస్తూ ఊరుకోం

- దళిత క్రైస్తవుల బ్లాక్ డే ర్యాలీ
- చైర్మన్ ఫాదర్ సల్లా మనోహర్

**కడప, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
డా బీ ఆర్ అంబేద్కర్ దళి త క్రైస్తవులకు కల్పించిన రా జ్యాంగ హక్కులను ఉల్లంఘిం చడం తగదని దయా సిస్ ఎస్సీ బీసీ కమిషన్ చైర్మన్ సల్లా మనో హర్, ప్రాజెక్టు డైరెక్టర్ ఇసుకల ఆనంద్ లు పేర్కొన్నా రు. సోమ వారం ప్రెసిడెన్సియల్ ఆర్డర్ 1950 కి వ్యతిరేకంగా కథోలిక పీఠాధిపతి సమాఖ్య, డైయాసిస్ ఎస్సీ, బీసీ కమీషన్ ఆధ్వర్యంలో బిషప్ సగినాల పాల్ ప్రకాశ్ ఆదేశాల మేరకు" బ్లాక్ డే" కార్య క్రమాన్ని నిర్వ హించారు. ముం దుగా దళిత క్రైస్తవులు మరియా పురం లోని కెథడ్రల్ చర్చి ప్రాంగ ణం నుంచి ర్యాలీగా వెళ్లి మె యిన్ రోడ్ గల కెథడ్రల్ చర్చి సర్కిల్ వరకు చేరుకొని. దళిత క్రైస్తవుల హక్కులను పరిరక్షిం చేందుకు పాలక ప్రభుత్వాలు చర్యలు తీసుకో వాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా ఫాదర్లు సల్లా మనోహర్, ఇసు కల ఆనంద్ లు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. లేక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. అసెం బ్లీ, పార్లమెంటు సభ్యులుగా దళిత క్రైస్తవులు ఉంటే ఆ వర్గాలకు సంబంధిం చిన సమ స్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. అనం తరం దళిత ఫోరం జిల్లా అధ్య క్షులు కిశోర్ బూసి పాటి మాట్లా డుతూ దళిత క్రైస్తవుల్లో తిరుగు బాటు రాక ముందే కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు ఎస్సీ హోదా కల్పిం చాల్సిన అవసరం ఉందన్నా రు. దేశానికి సుప్రీం సుప్రీంకోర్టు అయితే ఆ సుప్రీంకోర్టుకే సుప్రీం




భారత రాజ్యాంగమని చెప్పా రు. ఆర్టికల్ 14,15 ప్రకారం దళితులకు మత స్వేచ్ఛ ఉందని అన్నారు. అందరు కలిసి తీవ్ర స్థాయిలో ఉద్యమిం చక పోతే భవిష్యత్తు తరాలకు నష్టం వాటి ల్లే ప్రమాద ముందని ఆవేదన వ్యక్తంచేశారు. దళితులు మతం మారితే వారి ఆర్థిక పరిస్థి తి ఏమాత్రం మారదన్నారు ఏ కులం వారికి వర్తించని చట్టాలు కేవలం దళిత క్రైస్తవులకు మా త్రమే ఎలా వర్తిస్తాయని ప్రశ్నిం చారు. ఈ కార్యక్రమంలో వీ జి ఎండీ ప్రసాద్ రావు, విచారణ గురువు ఈరి మరియన్న, దళిత క్రైస్తవ పెద్దలు ఎండి అల్ఫో న్స్, వారాధి జోసెఫ్, ఎలియాస్ రెడ్డి, బాలస్వామి రెడ్డి, బండి మరియు లు, విజయ వాణి, సంధ్యారాణి, విక్టర్, మైఖేల్, అడ్వకేట్ జయరాజు, లారెన్స్, అల్లూరి జోజప్ప తదితరులు పాల్గొన్నారు




## తాండూర్‌లో జైల్ బరో - రాస్తారోకో

**తాండూర్, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్త జైల్ బరో కార్యక్రమంలో భాగంగా సోమవారం తాండూర్‌లో కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఆందోళన చేశారు. తాసిల్దార్ ఆఫీస్ నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి ఐబీలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ మాట్లాడుతూ... కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బదులు వచ్చిన విబిజీ రాంజీ చట్టం ఉపాధి కూలీలకు అన్యాయం చేస్తుందని, పాత చట్టాన్నే కొనసాగించాలని కోరారు. ఆదివాసీలు, ఇతర కులాల సాగు భూములకు పట్టాలు ఇచ్చి పేదలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లీలారాణి, సత్యవతి, కే విజయలక్ష్మి, ఎం విజయలక్ష్మి, శారద, లక్ష్మి, మగ్దూం, జైనేని రాజయ్య, బొల్లం రాజేశం, రెడ్డి మల్లక్క, వరలక్ష్మి, జేనేని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని
# శ్రీరామ పాదయాత్ర

- దావన్‌పల్లిలో ఘనంగా కలశ యాత్ర..
- జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం.






**రాయికల్, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు కళకళలాడాలని, లోకకల్యాణం,ధర్మస్థాపన జరగాలని ఆకాంక్షిస్తూ దావన్‌పల్లిలో శ్రీరామ హృదయ కలశ యాత్ర, శ్రీరామ పాదయాత్రను ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాలను పురస్కరించుకుని వికాస తరంగిణి, జాతీయవాది జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ బానావత్ తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు చెరుకు మహేశ్వర శర్మ, వికాస తరంగిణి బాధ్యులు చిలుకమర్రి శ్యామసుందరాచారి శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ ప్రసాద్, ఉపసర్పంచ్ రవి నాయక్, శ్రీహనుమాన్ దీక్ష గురుస్వామి జగన్‌లకు అందజేశారు. అనంతరం గ్రామపంచాయతీ నుంచి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వరకు భక్తులు 'జై శ్రీరామ్' నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు.

### మహేశ్వర శర్మకు సన్మానం

ఢిల్లీలో కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యుల చేతుల మీదుగా జాతీయ తెలుగు సారస్వత పరిషత్ జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం అందుకున్న చెరుకు మహేశ్వర శర్మను సర్పంచ్ ప్రసాద్, గ్రామస్థులు, వికాస తరంగిణి బాధ్యులు, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ ఘనంగా సన్మానించారు. భగవద్గీతను అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంతోష్, బలరాం, రాజు నాయక్, గంగరాజం, కొమురయ్య, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాజన్న సేవలో రాయికల్ మహిళా సేవకులు



**రాయికల్, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో రాయికల్ ప్రాంతానికి చెందిన మహిళా సేవకులు సోమవారం భక్తిశ్రద్ధలతో సేవలందించారు. శ్రీ వల్లి సేవా సంస్థ, కరీంనగర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని మహితాపూర్, జగిత్యాల పట్టణానికి చెందిన మహిళా సేవకులు ఇందులో పాల్గొన్నారు. వేములవాడలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భీమన్న ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం వద్ద క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. భక్తులు వరుసల్లో క్రమశిక్షణగా ఉండేలా చూస్తూ, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనానికి సహకరించారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు తాగునీటిని అందించి దాహార్తిని తీర్చారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సేవకులకు శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం తరపున శ్రీ వల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో బేతి రాధ, పెద్దిరెడ్డి రాజేశ్వరి, అనుమల్ల విజయ,మార్గం లక్ష్మి, ఎనుగందుల విజయ, ఎనుగందుల జయ, మొగిలిపేట లక్ష్మి, మాధురి, జల లక్ష్మి, రాధ, ఎనుగందుల కళ తదితరులు పాల్గొన్నారు.

# సుందరాచారి సుందర సృష్టి తెలుగు తల్లి గీతం :
## ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి



**కడప, ఆగస్టు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
శంకరంబాడి సుందరాచారి అద్భుత సృష్టి 'మా తెలుగు తల్లి కి మల్లెపూదండ, ను 'మన రాష్ట్ర గీతంగా ఏర్పాటు చేయడం ఎంతో ముదావహమని, ఈ గీతం మన సంస్కృతి, సంప్రదా యాలకు నిలువెత్తు రూపమని, తెలుగు నాట ఉన్న ప్రముఖమైన నదులను, సంస్కృతీ సాహిత్యా లను,చరిత్రలో ఉన్న ప్రసిద్ధ వ్యక్తు లను పాట లో ఆయన స్మరిం చారని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. రచయితల సంఘం ఆధ్వర్యంలో శంకరంబాడి సుంద రాచారి 113వ జయంతిని సోమవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ లో నిర్వ సూచించారు .ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన సుంద రాచారి బాల్యంలో అనేక కష్టాలు ఎదుర్కొన్నాడని, హోటల్లో సర్వర్ గా, రైల్వేలో కూలిగా పనిచేసిన ఆయన ఉపాధ్యాయునిగా,పాఠశాల పర్యవేక్షకు నిగా కొంత అభివృద్ధి సాధించిన ప్పటికీ ఆయనకున్న ఆత్మవి శ్వాసం వల్ల ఎక్కడా ఎక్కువ రోజులు నిలువలేకపోయారని చెప్పారు. ఆయనకు తేటగీతి పద్యమంటే ప్రాణమని,దాదాపు రచనలన్నీ తేటగీతి పద్యాల్లోనే రాశారని,సుందర రామాయ ణం,సుందర భాగవతం మొద లైన కావ్యాలు, శ్రీనివాస శతకం, ఏకలవ్యుడనే ఖండ కావ్యం తో పాటు భావ గీతాలు, జానపద గీతాలు, స్థల పురాణాలు రాశా రని,గాంధీ గారు చనిపోయి నప్పుడు ఆవేదనతో బలిదానం అనే కావ్యాన్ని రాశారన్నారు. ఈ కార్యక్రమం రాజీవ్ కల్చరల్ క్లబ్ అధ్యక్షులు మందల మురళి, బ్యాంకు గంగయ్య,బాల ఓబ య్య, ఎడవల్లి రామలింగయ్య, ఎం వెంకటసుబ్బయ్య, ఎం ప్రకా ష్ శర్మ, కే కిరీటి, కే నవనీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



**పల్నాడు (జర్నలిస్ట్ ఫైల్):** విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు పల్నాడు జిల్లాలోని నూజెండ్ల, ఐనవోలు, జంగాలపల్లి, మేకపాడు, ముక్కల్లూరు, లక్ష్మీపురం, రెడ్డిపాలెం, పువ్వాడ ప్రాంతాల్లో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ పి. విజయకుమార్ ఆధ్వర్యంలో 44 బృందాల్లో 44 మంది అధికారులు, 134 మంది సిబ్బంది 2,036 సర్వీసులను తనిఖీ చేశారు. మీటర్ లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ముగ్గురు, మీటర్ ఉన్నప్పటికీ చౌర్యానికి పాల్పడిన ఒకరు, అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగించిన 59 మందిపై మొత్తం రూ. 1.84 లక్షల అపరాధ రుసుము విధించారు.

విద్యుత్ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండేలా వినియోగదారులు చూసుకోవాలని, సీలు దెబ్బతిన్నా లేదా ఊడిపోయినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. మీటర్‌లో అక్రమ మార్పులు చేయడం, సీలు తొలగించడం, పనిచేయని మీటర్ ద్వారా విద్యుత్ వినియోగించడం వంటివి విద్యుత్ చౌర్యంగా పరిగణించి భారత విద్యుత్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యంపై 9440812262, 8639741050 నంబర్లకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## గెస్ట్‌హౌస్‌లో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



- 29 మంది అదుపులోకి.. రూ.23.77 లక్షల నగదు స్వాధీనం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పేకాట, జూదం స్థావరాలపై గుంటూరు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్‌రోడ్ ఫేజ్–1లో ఉన్న వైఫై గెస్ట్‌హౌస్‌పై సోమవారం మెరుపు దాడి నిర్వహించారు.

గెస్ట్‌హౌస్ మూడో అంతస్తులోని 304వ గదిలో పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో డీఎస్‌బీ డీఎస్పీ ఆలహరి శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. సీఐ–2 మల్లికార్జునరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, నల్లపాడు పోలీస్ సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 29 మందిని అదుపులోకి తీసుకున్నారు.

వారి నుంచి రూ.23,77,120 నగదు, 27 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహించినట్లు గుర్తించిన ఈశ్వరరావు (గుడివాడ), ఫణి (గుంటూరు)తో పాటు మొత్తం 29 మందిని తదుపరి విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం నిర్వహించే స్థావరాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ, వాటికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మంచినీటి సమస్య రానివ్వం : ఎమ్మెల్యే నసీర్

- ప్రతి ప్రాంతానికీ మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోండి
- ఖాళీ ప్రదేశాలపై దృష్టి సారించాలి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదు
- కమిషనర్‌కు విన్నవించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- సంగడిగుంటలో కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పర్యటన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా ఎమ్మెల్యే నసీర్ నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నాను. సంగడిగుంట ప్రాంతంలో మంచినీటి సమస్య ఉందని తెలియడంతో గురువారం నగర కమిషనర్ మయూర్ అశోక్ తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానిక ప్రజలకు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ కు స్వయంగా వివరించారు. మంచినీళ్లు లేక ఎలాంటి అవస్థలు పడుతున్నారో తెలియజేశారు. వెంటనే మంచినీటి సమస్య లేకుండా చేయాలని కమిషనర్ కు సూచించారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయని తెలిపారు. శానిటేషన్ సక్రమంగా ఉండటం లేదని, సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని, దీనిపై పర్యవేక్షణ అవసరమని చెప్పారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు మొలిచి ఇబ్బందులు నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని, యజమానులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని సూచించారు.

పీకలవాగు స్ట్రోమ్ డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేసి ఆరు, ఏడు వార్డుల్లో మురుగు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో డ్రెయిన్లను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా కమిషనర్ చూపించి ప్రజల సమస్యలను వివరించారు. కొద్దిపాటి వర్షానికే సంగడిగుంట, కబాడీగూడెం ప్రాంతాల్లో శానిటేషన్ సమస్య తలెత్తుతోందని తెలిపారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టామని చెప్పారు. అవసరమైన చోట మంచినీటి ట్యాంక్ ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. దీంతోపాటు మురుగు శాశ్వత నివారణకు కార్యాచరణ ద్వారా పనులు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని, కనీవినీ ఎరుగని రీతిలో చేపట్టామని చెప్పారు.

**రూ.1.35 కోట్లతో ఔట్ ఫాల్ డ్రెయిన్‌కు శంకుస్థాపన:**

స్థానిక జామియానగర్ గొట్టాల రోడ్లు రూ. 1.35 కోట్లతో ఔట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో మురుగు నీటి సమస్య లేకుండా చేసేందుకు ముందడుగు వేశామని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో శానిటేషన్ సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శంకుస్థాపన చేసిన పనులను వేగవంతం చేపడతామని చెప్పారు.

# స్వచ్ఛ గుంటూరు దిశగా జీఎంసీ : కమిషనర్ మయూర్ అశోక్

- ఆధునిక సాంకేతికతతో పారిశుధ్య నిర్వహణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ జీఎంసీ విస్తృత పారిశుధ్య చర్యలు చేపడుతోందని కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు పారిశుధ్య పనులు ప్రారంభించి, 7 గంటలకల్లా ప్రధాన రహదారుల శుభ్రత పూర్తి చేస్తున్నారు. అనంతరం ఒక టన్ను సామర్థ్యం కలిగిన ఎలక్ట్రిక్ ఆటోలతో ఇంటింటికీ చెత్త సేకరిస్తున్నారు. ఒక్కో ఆటోకు సుమారు వెయ్యి గృహాలను కేటాయించి జీపీఎస్ జియో ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రెండో షిఫ్ట్‌లో వార్డుల వారీగా డ్రెయిన్ల పూడికతీత, గ్యాంగ్ వర్క్ చేపడుతున్నారు. ప్రధాన డ్రెయిన్లకు మెకానికల్ క్లీనింగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. అక్రమ చెత్త డంపింగ్, ఖాళీ స్థలాల పరిశుభ్రత, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆరు మెకానికల్ స్వీపింగ్ యంత్రాలతో రాత్రివేళల్లోనూ ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు.

జీఎంసీ కాల్ సెంటర్, పీజీఆర్ఎస్, ఏపీసీఎంఎంఎస్, పురమిత్ర ద్వారా వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధిస్తున్నారు. ప్రతి ఎన్నికల వార్డులో కంపోస్టింగ్ యూనిట్లు, ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఈ–వేస్ట్ సేకరణకు ప్రత్యేక వాహనాలు అందుబాటులోకి తెచ్చారు. వర్షాకాలంలో ముంపు నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.

# సంజీవ్‌గాంధీనగర్‌లో ఇంటింటికీ తెలుగుదేశం

- ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని 30 వార్డు సంజీవ్ గాంధీ నగర్‌లో 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని, వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. జీవీ మాట్లాడుతూ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పనుల గురించి ప్రజలకు వివరంగా వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రారంభం



**బాపట్ల జిల్లా మెడికల్ (జర్నలిస్ట్ ఫైల్ )** చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు ఎం. మాల కొండయ్య మరియు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వి. నరేంద్ర వర్మ రాజు బాపట్ల ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా ప్రవేశపెట్టిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) వాహనాలను ఘనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం గర్భిణీలు మరియు ప్రసవానంతరం నవజాత శిశువులతో ఉన్న తల్లులకు, ముఖ్యంగా గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాల్లో, సకాలంలో మరియు సురక్షితమైన రవాణా సౌకర్యాలను అందించడం ద్వారా మాతా, శిశు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్వహించబడింది. నూతనంగా ప్రారంభించిన ఈ వాహనాల ద్వారా గర్భిణీలు, బాలింతలు మరియు నవజాత శిశువులకు అవసరమైన మాతా–శిశు ఆరోగ్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో సకాలంలో రిఫరల్ మరియు రవాణా సౌకర్యాలు కల్పించడానికి వీలుకలుగుతుంది. ఈ కార్యక్రమంలో బాపట్ల డి ఎం హెచ్ ఓ డా. ఎస్. విజయమ్మ డి సి హెచ్ ఎస్ డా. పద్మావతి , సూపరింటెండెంట్ డా. సిద్ధార్థ ,ఎన్టీఆర్ వైద్య సేవల డీసీ డా. ప్రవీణ్ , ఇతర కార్యక్రమ అధికారులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, జిల్లాలోని గర్భిణీలు, బాలింతలు మరియు నవజాత శిశువుల ప్రయోజనం కోసం 102 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజలకు అందుబాటులో, సకాలంలో మరియు నాణ్యమైన ఆరోగ్య రవాణా సేవలను నిరంతరం అందించేందుకు ఆరోగ్య శాఖ కట్టుబడి ఉందని తెలియజేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సి.ఆర్.డి.ఏ కార్యాలయంలో మంగళ వారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 13వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించుటకు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, న్యాయాధికారులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, మీడియా తదితరులు కూర్చునే ప్రదేశాల వద్ద ఏర్పాట్లు చేయాలని అన్నారు. అతిథులు వచ్చే మార్గాలు, పార్కింగ్ ప్రదేశం, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ప్లాన్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రదర్శించే శకటాలు తయారీ పూర్తి చేయాలని, 13వ తేదీన జరిగే తుది రిహార్సల్స్ లో పూర్తి స్థాయిలో ప్రదర్శన చూపాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. అంతకముందు 13వ తేదీన సీడ్ యాక్సెస్ రోడ్, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవాల దృష్ట్యా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తహసిల్దార్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసుల్లో పునరావృత నిందితుడిపై పీ.ఐ.టీ-ఎన్‌డీపీఎస్

- రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడుతూ పదేపదే కేసుల్లో చిక్కుకున్న తెనాలి ఇస్లాంపేటకు చెందిన ఎస్‌కే. సుల్తాన్ (26)పై పీ.ఐ.టీ. –ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988 పీ.ఐ.టీ. –ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 3(1) కింద ఉత్తర్వులు జారీ చేయడంతో రేపల్లె సబ్‌జైలు నుంచి అతడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు తెనాలి సబ్‌డివిజన్ డీఎస్పీ బి.జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో, తెనాలి వన్‌టౌన్ సీఐ సీహెచ్.రాంబాబు నేతృత్వంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చర్యలు కొనసాగుతున్నాయి. సుల్తాన్‌పై తెనాలి రూరల్, పెదకాకాని, తెనాలి వన్‌టౌన్, తెనాలి ఎక్సైజ్, తెనాలి టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో 2019 నుంచి 2026 వరకు మాదకద్రవ్యాలు, మానసిక ప్రభావిత పదార్థాల చట్టం (ఎన్‌డీపీఎస్), భారత శిక్షాస్మృతి, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద ఏడు కేసులు నమోదయ్యాయి.

జిల్లాలో ఇప్పటివరకు గంజాయి కేసుల్లో 460 మందిని అరెస్టు చేసి సుమారు 140 కిలోల గంజాయి, 4 లీటర్ల లిక్విడ్ గంజాయి, 58 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పీ.ఐ.టీ. ––ఎన్‌డీపీఎస్ చట్టం కింద సుల్తాన్‌తో కలిపి ఎనిమిది మందిని నిర్బంధించి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

డ్రగ్స్ నియంత్రణలో భాగంగా జిల్లాలో 40 కార్డన్ సెర్చ్‌లు నిర్వహించడంతో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో 325 'సంకల్పం' అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 47 వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి రవాణా, విక్రయం, నిల్వ లేదా వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

# తెలుగుదేశం పార్టీతోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి

- నాయీ బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం: మద్దిరాల గంగాధర్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డా. ఎంఎస్ఎస్ భవన్‌లో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దేవాలయాల కళ్యాణకట్టల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల వేతనాలను రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వానిదే అని గంగాధర్ తెలిపారు.

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే దేవాలయ కళ్యాణకట్టల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.15 వేల వేతనం కల్పించడంతో పాటు, రాష్ట్రంలో తొలిసారిగా నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాపులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించిన ఘనత కూడా తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్తును 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచిందని తెలిపారు. దేవాలయ పాలకమండళ్లలో నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఒక సభ్యుడిని నియమించే విధానాన్ని తీసుకువచ్చామని, దేవాలయాల్లో ఖాళీగా ఉన్న నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు.

నాయీ బ్రాహ్మణులు అధిక సంఖ్యలో సబ్సిడీ రుణాలు పొందేందుకు టీడీపీ ప్రభుత్వం అవకాశం కల్పించిందని గంగాధర్ పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో జీవో నెం.13, 14, 26 వంటి కీలక ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆదరణ పథకం–3ను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతోందని, ఇందుకోసం రూ.1,000 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. బీసీల సంరక్షణ కోసం బీసీ రక్షణ చట్టం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామిని మంగళంపల్లి బాలమురళీకృష్ణ పేరుతో జాతీయ అవార్డుతో పాటు రూ.10 లక్షల నగదు బహుమతితో కూటమి ప్రభుత్వం సత్కరించి గౌరవించిందని గంగాధర్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తోందని, ఆశించిన స్థాయికి మించి సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు అందుతున్నాయని ఆయన అన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కొక్కెరపాటి పూర్ణచంద్రరావు, మంగళగిరి టౌన్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఆకునూరి ఉమామహేశ్వరరావు, యడ్లపల్లి భిక్షారావు, యాజలి కృష్ణ, అద్దేపల్లి సుబ్రహ్మణ్యం, మంగళగిరి సుబ్బారావు తదితర నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన కల్పించాలి

- వ్యవసాయ యాంత్రీకరణతోనే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా రైతులకు అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు అన్నారు.

మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో లాం లోని కృష్ణ ఆడిటోరియంలో నిర్వహించిన కిసాన్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమం, వ్యవసాయ అనుబంధ శాఖల విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను రైతులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన ఫలితాలను, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేసి, వాటి ప్రయోజనాలను వారు పొందేలా చేయడంలో ఇటువంటి కిసాన్ మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. డాక్టర్‌కు రోగికి ఉన్న అవినాభావ సంబంధం మాదిరిగానే వ్యవసాయ శాస్త్రవేత్తకు రైతుకు మధ్య సన్నిహిత సంబంధం ఉండాలని ఆయన అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి శాస్త్రీయ పరిష్కారాలను సూచించాలని పేర్కొన్నారు. దేశానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను అందించే జిల్లాగా గుంటూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, నూతన సాగు పద్ధతులను అందిపుచ్చుకోవడంతో పాటు వ్యవసాయ యాంత్రీకరణను విస్తృతంగా చేపట్టడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని తెలిపారు.

కిసాన్ మేళాలో రైతులకు వివిధ వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ అనుబంధ రంగాలపై నిపుణులు అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను నేరుగా అడిగి నివృత్తి చేసుకునేలా ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన రైతులకు ఉపయోగకరంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ రామచంద్రరావు, లాం ఫారం ఏడీఆర్ దుర్గాప్రసాద్, ఆత్మ పీడీ వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి, డీపీఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల దమనకాండను ఖండిస్తున్నాం

**○ రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిపై ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ప్రశ్నలు**



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** జార్ఖండ్ రాజధాని రాంచీలో తమ ఉద్యోగాలు, ఉపాధి, భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విశాఖపట్నంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్-జేఎంఎం ప్రభుత్వం అందుకు బదులుగా లాఠీచార్జ్, టియర్‌గ్యాస్, వాటర్ క్యానన్లు, బారికేడ్లతో అణచివేతకు పాల్పడటం దురదృష్టకరమని మాధవ్ విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో హక్కుల కోసం నిరసన చేస్తున్న విద్యార్థులను శత్రువులుగా చూడటం సరికాదన్నారు. మహిళా విద్యార్థుల పట్ల కూడా అనుచితంగా వ్యవహరించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై స్పందించే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జార్ఖండ్ విద్యార్థుల ఆందోళనపై ఎందుకు మౌనం వహిస్తున్నారని మాధవ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒక విధంగా, ఇతర రాష్ట్రాల్లో మరో విధంగా స్పందించడం ద్వంద్వ వైఖరి కాదా అని నిలదీశారు. రాహుల్ గాంధీ నిజంగా విద్యార్థుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఉంటే జార్ఖండ్‌కు వెళ్లి వారిని పరామర్శించి, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో కాంగ్రెస్ గందరగోళం సృష్టిస్తోందని మాధవ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ సభను సజావుగా సాగనివ్వకుండా ప్రతిపక్షం అడ్డుకోవడం సరికాదన్నారు. జంతర్‌మంతర్ ఘటనపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే పార్లమెంట్‌లో వెల్లడించాలని కోరారు. జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల చర్యలపై నిష్పక్షపాత విచారణ జరపాలని, అనవసరంగా కేసులు నమోదు చేసి ఉంటే ఉపసంహరించాలని మాధవ్ డిమాండ్ చేశారు. అధిక బలప్రయోగానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, యువత హక్కులు, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడితే బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# డిమాండ్లు పరిష్కరించే వరకు జూనియర్ డాక్టర్స్ ఆందోళన



**○ అత్యవసర వైద్య సేవలకు మినహాయింపు డిమాండ్లపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పోస్ట్‌గ్రాడ్యుయేట్ వైద్యుల న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె తొలిదశ మంగళవారం కొనసాగింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన శిక్షణ వైద్యులు, పీజీ విద్యార్థులు, సూపర్ స్పెషాలిటీ పీజీలు, సీనియర్ రెసిడెంట్లు, జూడా సభ్యులు ఉదయం 9 గంటలకు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో సమావేశమై మధ్యాహ్నం 1 గంట వరకు నిరసన తెలిపారు. ఆందోళన సందర్భంగా రోగుల వైద్య అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ, అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. తొలిదశలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేశారు. అత్యవసర వైద్యం, అత్యవసర చికిత్స విభాగం, అత్యవసర శస్త్రచికిత్సలను సమ్మె నుంచి మినహాయించారు. దీంతో అత్యవసర వైద్య సేవలు యథావిధిగా కొనసాగాయి.

**హామీపై స్పష్టత కోరుతున్న జూడా:** తమ డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని జూడా ప్రతినిధులు తెలిపారు. అయితే చర్చల్లో అంగీకరించిన అంశాలపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. లిఖితపూర్వక హామీ లభిస్తే సమ్మెను విరమించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి, వైద్య విద్య సంచాలకులతో మంగళవారం మరోసారి చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు.

**15 వరకు రెండో దశ:** చర్చల ద్వారా సంతృప్తికరమైన పరిష్కారం లభించకపోతే బుధవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు సమ్మె రెండో దశ కొనసాగుతుందని ఏపీ జూడా ప్రకటించింది. ఈ దశలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం కాని వైద్య సేవలు, అంతర్గత రోగుల సేవలను నిలిపివేయనున్నట్లు తెలిపింది. అత్యవసర వైద్య సేవలు, అత్యవసర చికిత్స విభాగం, అత్యవసర శస్త్రచికిత్సలకు మాత్రం ఎలాంటి అంతరాయం ఉండదని జూడా స్పష్టం చేసింది. అత్యవసర వైద్య సేవలను కొనసాగిస్తూ, ఆందోళనను శాంతియుతంగా, బాధ్యతా యుతంగా నిర్వహిస్తామని పేర్కొంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, డిమాండ్ల పరిష్కారానికి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని జూడా ప్రతినిధులు కోరారు.

# కుడి భుజానికి సర్జరీ చేయించుకోనున్న జూనియర్ ఎన్టీఆర్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ తెలుగు సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. గత నెలలో తగిలిన గాయంపై వైద్యుల పర్యవేక్షణ అనంతరం, హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన బృందం ఒక ప్రకటనలో వెల్లడించింది.

గత నెల జులై 27న ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో డాక్టర్ జె. మధుసూదన్‌రావు, డాక్టర్ ఆర్.ఎ. పురంచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఆయన్ను పరీక్షించి, గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని సూచించారు. అప్పట్లో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ప్రతినిధులు ఒక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా ఎన్టీఆర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, "వైద్యుల సూచన మేరకు ఎన్టీఆర్‌కు రేపు కిమ్స్ ఆసుపత్రిలో భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. ఆయన త్వరగా కోలుకునేలా చూసేందుకు వైద్య బృందం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని వెల్లడిస్తాం. మీ మద్దతుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ గాయం కారణంగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

# నెలాఖరులోగా ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్ సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు

**○ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, శానిటేషన్ ఏజెన్సీల వారు పరస్పరం సమన్వయంతో పనిచేయాలి**

**○ మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**○ ఆసుపత్రుల్లోని పరిస్థితులపై 3 గంటలపాటు సమీక్షించిన మంత్రి**




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత పరిశుభ్రత మరీశీత మెరుగుపడేందుకు ఆసుపత్రుల సూపర్డెంట్లు, ఏజెన్సీ వారు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వైద్యుల హాజరు, వారందించే సేవలు, మందుల లభ్యత పట్ల ప్రజల సంతృప్త స్థాయికి తగ్గట్లుగా పరిశుభ్రత విషయంలోనూ సానుకూలత పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బోధానాసుపత్రులు, జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో పరిశుభ్రత తీరు, సంతృప్త స్థాయి నమోదు ఇతర అంశాలపై అధికారులు, సదరు ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, శానిటేషన్ ఏజెన్సీల వారితో మూడు గంటల పాటు చర్చించారు. ఈ ఏడాది ఏప్రిల్-జులై కాలంలో సెకండరీ ఆసుపత్రుల్లో పరిశుభ్రత పట్ల ప్రజా సానుకూలత ఆశించిన స్థాయిలో నమోదు కాకపోవటం, ఆసుపత్రుల్లోని సమస్యలు, సమన్వయం వంటి అంశాలపై సూపరింటెండెంట్లు, ఏజెన్సీల వారి నుంచి వివరణ కోరారు. ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలలు, బోధానాసుపత్రులు, సెకండరీ ఆసుపత్రుల్లో శానిటేషన్ మరియు సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జరగాల్సిన సిబ్బంది నియమికాలు, వాస్తవంలో నమోదవుతున్న హాజరు, వ్యత్యాసాలను మంత్రి ఆరా తీశారు. ఎఫ్ఆర్ యస్ విధానంలో పూర్తి స్థాయి హాజరు నమోదు కాకపోవడానికి కారణాలపై మంత్రి అధికారులు, ఏజెన్సీల నుంచి తెలుసుకున్నారు. తాము తగు స్థాయిలో సిబ్బందిని నియమించినా ఎఫ్ఆర్ యస్ హాజరు కొన్ని కారణాల వలన నమోదు కావడంలేదని ఏజెన్సీలు తెలుపగా, ఈ నెలాఖరుకు మొత్తం సిబ్బంది ఎఫ్ఆర్‌యస్ వ్యవస్థలో నమోదయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు, ఏజెన్సీలను మంత్రి ఆదేశించారు.

**నిరంతర సమీక్షలు జరగాలి**

మంగళవారంనాటి సమీక్షలో వైద్య సంస్థల ఉన్నతాధికారులు, సర్వీసులందించే ఏజెన్సీల మధ్య ఆశించిన స్థాయిలో సమన్వయం జరగడంలేదని, పారిశుధ్య మరియు సెక్యూరిటీల ప్రాధాన్యత దృష్ట్యా, ఈ అంశాలకు సంబంధించిన అన్ని సమస్యలనూ ప్రతి వారం క్షుణ్ణంగా సమీక్షించి, తీసుకున్న నిర్ణయాలను తదుపరి చర్యలను తనకు అందజేయాలని శాఖ కార్యదర్శి శ్రీ వీరపాండియన్ ఆదేశించారు. వివిధ సంస్థల ప్రాంగణాల్లోని ప్రధాన ప్రాంతాలకు పర్యవేక్షణా అధికారులను నియమించాలని సూచించారు. పూర్తి స్థాయిలో ఎఫ్ఆర్‌యస్ ఎన్‌రోల్‌మెంట్ జరిగిన తర్వాత, మరో సమీక్ష నిర్వహిస్తామని అప్పటికి సేవల నాణ్యత మెరుగుపడాలని కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో డియస్‌హెచ్ చక్రధర్ బాబు, డిఇంఈ డాక్టర్ విష్ణువర్ధన్, పలువురు ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం దారుణం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**○ ఫలితాలు వచ్చినప్పుడు అభినందనలు.. ఇప్పుడు బోగస్ అంటూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ మండిపడ్డ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ పై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే కుట్రలో భాగమేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

డీఎస్సీ ఫలితాలు విడుదలైన వెంటనే తెనాలి మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఉత్తమ ఫలితాలు సాధించారని వైసీపీ నాయకులే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అభినందనలు తెలిపారని గుర్తుచేశారు. అప్పుడు డీఎస్సీ ప్రక్రియపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయకుండా, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అదే డీఎస్సీని బోగస్ గా చిత్రీకరించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల పేరుతో మోసం జరిగిందని, డీఎస్సీ నిర్వహణ విషయంలో కాలయాపన తప్ప మరోటి చేయలేదని విమర్శించారు. కానీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో మెగా డీఎస్సీ ని పారదర్శకంగా నిర్వహించి వేలాది మంది యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించారని తెలిపారు.

విద్యారంగ సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని గళ్ళా మాధవి కొనియాడారు. నిరుద్యోగ యువత ఆశలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని అన్నారు. తమ పార్టీకి చెందిన వ్యక్తులు ఎంపికైతే గొప్పలు చెప్పుకుని, ఇప్పుడు అదే డీఎస్సీని బోగస్‌గా విమర్శించడం వైసీపీ నాయకుల రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ట అని విమర్శించారు. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడటం మానుకుని, అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని వైసీపీ నేతలకు హితవు పలికారు.

# ఏ కష్టమొచ్చినా నేనున్నా



**○ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల పాలన- ఇంటింటికి ప్రచారంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో "మన ఇంటికి- మన నసీర్" కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ లీడర్ నుంచి కేడర్ వరకు ఉత్సాహంతో ముందుకు కదిలారు. గురువారం స్థానిక బాలాజీ నగర్ లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గుమ్మానికి వెళ్లి ఎమ్మెల్యే నసీర్ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ గురించి ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అవకాశం ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే సంక్షేమాన్ని తీసుకొస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రజల మంచినీటి అవసరాలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టామన్నారు. దీంతోపాటు పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ఇది కేవలం ఇంటింటికి ప్రచారమే కాదని ప్రజలకు, ప్రభుత్వానికి వారధి నిర్మిస్తున్నామని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం తోడుగా నిలుస్తుందనే నమ్మకాన్ని కలిగిస్తున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని ఎక్కడ అని గూగుల్ అడిగినా చెప్పలేని పరిస్థితి అని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పంతో ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారని చెప్పారు.

# సిఐటియు నాయకత్వంపై పోలీసుల వేధింపులు ఆపాలి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాజమండ్రి సిఐటియు నాయకత్వంపై పోలీసులు వేధింపులకు పాల్పడటాన్ని సిఐటియు రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. సిఐటియు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఏవీ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10న దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న తూర్పుగోదావరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్‌ను అదే రోజు అర్ధరాత్రి అరెస్టు చేసేందుకు స్థానిక పోలీసులు ప్రయత్నించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని సిఐటియు నాయకులు ఆరోపించారు. దీనికి నిరసనగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్‌భరో కార్యక్రమం నిర్వహించగా, రాష్ట్రంలో 100కు పైగా కేంద్రాల్లో కార్మికులు, కర్షకులు విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మిక సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తోందని, ఏళ్ల తరబడి కనీస వేతనాలను సవరించకుండా కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యలపై ప్రశ్నిస్తున్న కార్మిక సంఘాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసులు, నిర్బంధాలతో సిఐటియు నాయకత్వాన్ని భయపెట్టాలని ప్రయత్నిస్తే వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. కక్ష సాధింపు చర్యలను వెంటనే నిలిపివేసి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. లేనిపక్షంలో మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం పోలీసు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే నాయకులపై అక్రమ కేసులు పెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని కమిటీ డిమాండ్ చేసింది.

# గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు దశాబ్దం

**○ జీజీహెచ్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయించుకున్న వారితో నేడు వైద్యుల ముఖాముఖి**




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు, వారి కుటుంబ సభ్యులతో వైద్యులు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభమై నేటికి ఒక దశాబ్దం పూర్తికావస్తున్న తరుణంలో, అప్పట్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి యోగక్షేమాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, భవిష్యత్తులో అవసరమయ్యే వైద్య సేవలను తెలుసుకోవడమే ఈ సమావేశం ఉద్దేశమని జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పి. అనిల్ బాబు తెలిపారు.

ఆగస్టు 12న నిర్వహించే కీళ్ల మార్పిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జీజీహెచ్ ఎంసీహెచ్ బ్లాక్‌లోని ఐదో అంతస్తులో ఉన్న కాన్ఫరెన్స్ హాల్లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఉన్నతి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**కామినేని చొరవతో జీజీహెచ్‌లో శస్త్రచికిత్స**

అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ చొరవతో తన మోకీళ్ల మార్పిడికి జీజీహెచ్‌ను ఎంచుకున్నారని డాక్టర్ అనిల్ బాబు తెలిపారు. డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం ఆ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఆయన అందించిన సహకారం, స్ఫూర్తితో ఉన్నతి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి సౌజన్యంతో జీజీహెచ్‌లో నిరుపేదలకు 100కుపైగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉచిత మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల ద్వారా నిరుపేదలకు ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు.

**యోగక్షేమాలు తెలుసుకునేందుకే సమావేశం**

మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి చికిత్స అనంతరం అందుతున్న ఆరోగ్య ప్రయోజనాలు, వారు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తులో అవసరమయ్యే వైద్య సేవలను తెలుసుకోవడం ముఖ్య ఉద్దేశమని డాక్టర్ అనిల్ బాబు తెలిపారు. దాదాపు దశాబ్దం పాటు శస్త్రచికిత్సల అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నేరుగా తెలుసుకునే అవకాశం ఈ సమావేశం ద్వారా లభిస్తుందన్నారు.

శస్త్రచికిత్సలు చేయించుకున్న వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి యోగక్షేమాలను తెలుసుకోవడంతో పాటు భవిష్యత్తులో అవసరమయ్యే వైద్య సహాయం, వైద్యుల సూచనలపై చర్చించనున్నట్లు తెలిపారు. గతంలో జీజీహెచ్‌లో అందించిన ఉచిత మోకీళ్ల మార్పిడి సేవల ఫలితాలను తెలుసుకోవడంతో పాటు, రోగులు తమ అనుభవాలను వైద్యులతో పంచుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమానికి అతిథులు, మీడియా ప్రతినిధులను ఆహ్వానించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం తెలిపింది.

# దుండిపాలెం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండ

**○ సంక్షేమ పథకాలతో గ్రామానికి రూ.1.84 కోట్ల లబ్ధి.. ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు**



**చుండూరు(జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. చుండూరు మండలం దుండిపాలెం గ్రామంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను కలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2, ఎన్టీఆర్ భరోసా తదితర సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. గ్రామంలోని కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలు, సూచనలను తెలుసుకుని మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో గ్రామాల్లో ఇదే తరహాలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజల సమస్యలను నమోదు చేయాలని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్--యూనిట్--బూత్ ఇన్‌ఛార్జ్‌లకు పిలుపునిచ్చారు.

3,487 మంది జనాభా, 1,040 కుటుంబాలు ఉన్న దుండిపాలెం గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.1.84 కోట్ల ప్రయోజనం అందిందని ఎమ్మెల్యే తెలిపారు. తల్లికి వందనం కింద 406 మంది విద్యార్థులకు రూ.52.78 లక్షలు, అన్నదాత సుఖీభవ కింద 2,036 మంది రైతులకు రూ.28.50 లక్షలు, ఎన్టీఆర్ భరోసా కింద 492 మంది లబ్ధిదారులకు రూ.20.71 లక్షలు, డ్వాక్రా తోడు కింద 1,007 మంది మహిళలకు రూ.76 లక్షల ఆర్థిక సహాయం అందినట్లు వివరించారు.

దీపం-2 పథకం కింద 154 కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, పీఎం కిసాన్ కింద 693 మంది రైతులకు రూ.4.15 లక్షలు, ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా 600 మందికి ఉచిత వైద్య సేవలు, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద 10 మందికి రూ.4,17,431 ఆర్థిక సహాయం అందినట్లు తెలిపారు.

**రూ.36.17 లక్షలతో అభివృద్ధి పనులు**

దుండిపాలెం గ్రామంలో రూ.36.17 లక్షల విలువైన వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. పల్లెపండుగలో భాగంగా రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉండగా, రూ.5 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం పూర్తయిందన్నారు. రూ.3 లక్షలతో జూజ టాయిలెట్ నిర్మాణంలో ఉందని, రూ.13.17 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం కొనసాగుతోందని వివరించారు.

గ్రామంలో 5.14 కి.మీ. సీసీ రోడ్లు, 0.54 కి.మీ. బీటీ రోడ్లు, 0.88 కి.మీ. సీసీ డ్రైనేజ్, 26 చేతిపంపులు, 250 వీధి దీపాలు, రెండు పాఠశాలలు, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక రైతు సేవా కేంద్రం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

చుండూరు మండల పరిధిలో 186 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మొత్తం రూ.1.70 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

'స్వర్ణాంధ్ర-విజన్ 2047' లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు సాగునీటి ప్రాజెక్టులు, పోలవరం, అమరావతి రాజధాని అభివృద్ధి, రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల ఆశీస్సులతో దుండిపాలెం గ్రామానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సీయుబీ ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467